thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 108 | జగిత్యాల   గురువారం   16 జూలై, 20266 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

## ఫ్రాన్స్‌ను మట్టికరిపించిన స్పెయిన్



11

## ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.2.19 లక్షల కోట్లకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, వారణాసి అభివృద్ధికి భారీ ఊతం
- ఎరువుల స్వయం సమృద్ధి.. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు నిర్ణయాలు

4



## స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో గ్యాస్ సిలిండర్‌లు

- 10 నిమిషాల్లోనే ఇంటికి..
- హెచ్‌పీసీఎల్ వినూత్న సేవ
- దేశంలో తొలిసారిగా బెంగళూరులో ప్రారంభం

10 కేజీల నవ్య సిలిండర్లకు క్విక్ డెలివరీ

4



# పాలమూరు రైతులకు త్వరలోనే శుభవార్త



### పాలమూరు ఎత్తిపోతలకు త్వరలోనే మోక్షం

ఎత్తిపోతల ప్రాజెక్టు అనుమతులకు సీఎం హామీ
ఏపీ, కేంద్రంతో ముమ్మరంగా సంప్రదింపులు
డిండి ప్రాజెక్టు నీటి కేటాయింపులపై దృష్టి
దివిటిపల్లిలో అమర రాజా బ్యాటరీ ప్లాంట్ షురూ
స్థానిక యువతకే ఎక్కువ ఉద్యోగాలివ్వాలని పిలుపు

పాలమూరు జిల్లాలోని నిరుపేద రైతాంగానికి త్వరలోనే ఒక తీపి కబురు అందించబోతున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. దశాబ్దాలుగా జిల్లా సాగునీటి అవసరాలను తీర్చేందుకు నిర్మిస్తున్న పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంపూర్ణ అనుమతులను సాధించే దిశగా కీలక అడుగులు పడుతున్నాయని వెల్లడించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో ఏర్పాటు చేసిన అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (జ్యూ) బ్యాటరీ తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా సీఎం మాట్లాడారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వాలను ఒప్పించి పూర్తి స్థాయి అనుమతులు తీసుకురావడానికి గట్టి ప్రయత్నాలు చేస్తున్నామని, త్వరలోనే దీనిపై జిల్లా రైతులకు ఒక శుభవార్త వినబడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

*మహబూబ్‌నగర్, జూలై 15 (చురకలు):*

2



## దేశానికి తెలంగాణ రోల్‌మోడల్

- ఫ్యూచర్ సిటీతో ప్రపంచ దృష్టి హైదరాబాద్ వైపు
- 2047 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

2



## బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ గృహనిర్బంధం

- భీంగల్ అభివృద్ధి పనుల కోసం దీక్ష
- వేల్పూర్‌లోని నివాసంలో నిర్బంధం
- నియోజకవర్గంలో అరెస్టుల పర్వం
- 100 పడకల ఆసుపత్రి, సీసీ రోడ్ల పెండింగ్ పనులను పూర్తి చేయాలని డిమాండ్
- శాంతియుత నిరసనను అడ్డుకోవడం ప్రభుత్వ రాక్షసత్వమేనని ఎమ్మెల్యే ఆగ్రహం
- పోలీసుల తీరుపై హరీశ్‌రావు ఫైర్

2

బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని భీంగల్ పట్టణ అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేపట్టిన ఒకరోజు కఠోర నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. వేల్పూర్‌లోని ఆయన నివాసంలోనే ఎమ్మెల్యేను హౌస్ అరెస్ట్ చేశారు.



## లాకప్ డెత్ కేసులో కానిస్టేబుళ్ల రిమాండ్

సాక్ష్యాల ధ్వంసంలో కీలక పాత్ర పోషించారన్న సిట్

3

సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో నిందితులుగా ఉన్న కానిస్టేబుళ్లు బత్తుల బాబూరావు, శాంతయ్యను సిట్ అధికారులు కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది.

## సర్ నమోదు గడువు పెంపు

ఆగస్టు 3 వరకు అవకాశం
ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ విడుదల
అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా

2



## పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయండి

- సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ
- షాబాద్ ఘటనలో నిందితుడికి బెయిల్ రావడంపై ఆందోళన
- పోక్సో కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ఎస్‌ఓపీ, నిఘా విభాగాలు అవసరం
- 60 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సూచన
- నేర చరిత్ర గల నిందితులపై రౌడీషీట్లు తెరవాలని ప్రతిపాదన
- చర్యలపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక ఇవ్వాలని కోరిన పవన్

2





## అయోధ్య విరాళాల వివాదం

- 'నేను పారిపోయే వాడిని కాదు'
- ట్రస్ట్ కోశాధికారి స్పష్టీకరణ
- రూ. మూడు కోట్ల నగదు గోల్‌మాల్‌పై ఎస్‌బీఐపైనే విమర్శలు
- బంగారం మాయమైందన్న ప్రచారాన్ని ఖండించిన ట్రస్ట్

4

## హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ ఇంట్లో ఏసీబీ దాడులు

- రూ.100 కోట్లకుపైగా అక్రమాస్తుల వెలికితీత
- 20 గంటల సోదాల అనంతరం రవీందర్ అరెస్ట్
- ప్లాట్లు, విల్లా, భవనం, భూములు.. భారీగా నగదు, బంగారం, వెండి స్వాధీనం
- ఆస్తుల మూలాలు, కీలక ప్రాజెక్టుల ఆర్థిక లావాదేవీలపై లోతైన దర్యాప్తు



**హైదరాబాద్, జూలై 15:** హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ రవీందర్ నివాసంలో ఏసీబీ నిర్వహించిన విస్తృత సోదాల్లో రూ. 100 కోట్లకు పైగా విలువైన అక్రమాస్తులు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు 20 గంటల

..వివరాలు 2లో



## సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై పిల్

- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!
- వేగంగా క్షీణిస్తున్న కార్యకర్త ఆరోగ్యం
- ఇప్పటికే 8.5 కిలోల బరువు తగ్గినట్లు కోర్టుకు తెలిపిన పిటిషనర్
- తక్షణ వైద్య సహాయంపై నివేదిక ఇవ్వాలని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు ఆదేశం

4



# బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ గృహనిర్బంధం

## భీంగల్ అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్యే దీక్ష

## వేల్పూర్‌లోని నివాసంలో వేముల నిర్బంధం..

**నిజామాబాద్/హైదరాబాద్, జూలై 15 (చురకలు):** బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని భీంగల్ పట్టణ అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చేపట్టిన ఒకరోజు కఠోర నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. వేల్పూర్‌లోని ఆయన నివాసంలోనే ఎమ్మెల్యేను గృహనిర్బంధం చేశారు. ప్రజా సమస్యలపై తాను అహింసా మార్గంలో శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే, వందలాది మంది పోలీసులతో ఇళ్లను ముట్టడించి నిర్బంధించడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాక్షస చర్య అని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో 75 శాతం పనులు పూర్తి చేసుకున్న భీంగల్ 100 పడకల ఆసుపత్రి భవనాన్ని తక్షణమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వేముల డిమాండ్ చేశారు. వీటితో పాటు భీంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్, నిలిచిపోయిన రూ. 12 కోట్ల సీసీ రోడ్ల పనులను పూర్తి చేయాలని, మూతపడిన భీంగల్ బస్ డిపోను పునఃప్రారంభించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసమే తాను చుక్క నీరు కూడా ముట్టకుండా నిరసన తెలుపుతుంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందన్నారు. భీంగల్‌లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని తొలగించి, ఫ్లెక్సీలను చించేయడం ఘోరమన్నారు. తనను ఇంట్లో నిర్బంధించినా, జైల్లో పెట్టినా తన సత్యాగ్రహ దీక్ష ఎక్కడున్నా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పనులపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తే తక్షణమే దీక్ష విరమిస్తానని వేముల పేర్కొన్నారు. మరోవైపు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి నిర్బంధాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. దీనిపై బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు హైదరాబాద్‌లో స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీంగల్ ప్రజల దశాబ్దాల కలల ప్రాజెక్టుల కోసం శాంతియుతంగా దీక్ష చేయాలనుకున్న ప్రజాప్రతినిధిని హౌస్ అరెస్ట్ చేయడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనకు నిదర్శనమన్నారు. తమది 'ప్రజా ప్రభుత్వం' అని చెప్పుకుంటూ విపక్షాలపై ఉక్కుపాదం మోపడం, పోలీసు రాజ్యాన్ని నడపడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. హిట్లర్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించిన హరీశ్‌రావు.. ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

# పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయండి

## సీఎం రేవంత్‌రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

## షాబాద్ ఘటనలో నిందితుడికి బెయిల్ రావడంపై ఆందోళన

## పోక్సో కేసుల దర్యాప్తునకు ప్రత్యేక ఎస్ఓపీ, నిఘా విభాగాలు అవసరం

## 60 రోజుల్లోనే దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని సూచన

## నేర చరిత్ర గల నిందితులపై రౌడీషీట్లు తెరవాలని ప్రతిపాదన

## చర్యలపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక ఇవ్వాలని కోరిన పవన్

**హైదరాబాద్, జూలై 15 (చురకలు):** చిన్నారులపై జరుగుతున్న లైంగిక నేరాల నివారణకు, పోక్సో చట్టాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి కీలక లేఖ రాశారు. బాధితులకు వేగంగా న్యాయం అందించడంతో పాటు నిందితులకు కఠిన శిక్షలు పడేలా పలు ప్రతిపాదనలను అందులో పొందుపరిచారు. తెలంగాణలో ఇటీవల జరిగిన షాబాద్ ఘటనను లేఖలో ప్రస్తావించిన పవన్.. పోక్సో కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన నిందితుడు ఏకంగా ఆరుగురిని దారుణంగా హత్య చేయడం తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. ఇలాంటి కేసులలో నిందితుల బెయిల్ పిటిషన్లను కోర్టులలో పోలీసులు మరింత కఠినంగా ప్రతిఘటించాలని, బాధితుల కుటుంబాలకు పటిష్ట భద్రత కల్పించాలని కోరారు. పోక్సో కేసులను విచారించే పోలీసు అధికారులకు బాలలతో సున్నితంగా వ్యవహరించడం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల సేకరణపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని పవన్ ప్రతిపాదించారు. ఘటన జరిగిన 24 గంటల్లోనే బాధితులకు వైద్య పరీక్షలు పూర్తి చేసి నివేదికలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కేసుల్లో ప్రాథమిక విచారణ పేరిట ఆలస్యం చేయకుండా వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణ కేసులను 60 రోజుల్లో, సంక్లిష్టమైన కేసులను 90 రోజుల్లోగా దర్యాప్తు పూర్తి చేసి చార్జ్‌షీట్ దాఖలు చేయాలని, ఈ పెండింగ్ కేసులను జిల్లా ఎస్పీలు, రేంజ్ ఐజీలు ప్రతి నెల సమీక్షించాలని సూచించారు. బాధితుల రక్షణ కోసం ప్రతి కేసులోనూ ప్రత్యేక ప్రణాళిక ఉండాలని, అవసరమైతే పోలీసు పహారా కల్పించి వన్‌స్టాప్ సెంటర్లతో అనుసంధానం చేయాలని కోరారు. బెదిరింపులకు పాల్పడే నేర చరిత్ర గల నిందితులపై రౌడీషీట్లు తెరవాలని, పాఠశాలలు, హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లలో తప్పనిసరి రిపోర్టింగ్ వ్యవస్థను తీసుకురావాలని స్పష్టం చేశారు. పోక్సో కేసుల పర్యవేక్షణకు రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) విడుదల చేయడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. చిన్నారులపై జరిగే నేరాలను సాధారణ అంశంగా కాకుండా అత్యంత ప్రాధాన్యతతో చూడాలని స్పష్టం చేసిన పవన్.. ఈ చర్యల అమలుపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. పోక్సో అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందనే ఆశాభావాన్ని పవన్ కళ్యాణ్ వ్యక్తపరిచారు.

# పాలమూరు రైతులకు త్వరలోనే శుభవార్త

- ఎత్తిపోతల ప్రాజెక్టు అనుమతులకు సీఎం హామీ
- పాలమూరు ఎత్తిపోతలకు త్వరలోనే మోక్షం
- ఏపీ, కేంద్రంతో ముమ్మరంగా సంప్రదింపులు
- డిండి ప్రాజెక్టు నీటి కేటాయింపులపై దృష్టి
- దివిటిపల్లిలో అమర రాజా బ్యాటరీ ప్లాంట్ షురూ
- స్థానిక యువతకే ఎక్కువ ఉద్యోగాలివ్వాలని పిలుపు



**మహబూబ్‌నగర్, జూలై 15 (చురకలు):** పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కోసం ఎదురుచూస్తున్న రైతు లకు త్వరలోనే శుభవార్త అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి అవసరమైన అనుమతులను కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేగంగా ముందుకు సాగుతోందని వెల్లడించారు. అలాగే డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపుపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి బుధవారం ప్రారంభించి పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ, కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న డిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, భీమా-నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు పొరుగు రాష్ట్రంతో చర్చలు కొనసాగుతున్నాయని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుతో పాటు అన్ని సాగునీటి పథకాలకు పూర్తి స్థాయి అనుమతులు సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయడం తన బాధ్యత అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తాను పాలమూరు బిడ్డనని, వెనుకబడిన జిల్లాను రాష్ట్రంలోనే అత్యంత అభివృద్ధి చెందిన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్య, నీటిపారుదల, పారిశ్రామికాభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న ముఖ్యమంత్రి, పాలమూరులో ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, యంగ్ ఇండియా సమీకృత నివాస పాఠశాలలు, ప్రతి నియోజకవర్గానికి నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యాలతో ప్రత్యేక విధానాలు రూపొందించామని, పర్యాటకం, ఇంధనం, వైద్యం, క్రీడా రంగాలకు కొత్త విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. పారిశ్రామికాభివృద్ధి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను పరిశ్రమలు గుర్తించాలని, స్థానిక యువతకే ఉద్యోగాల్లో తొలి ప్రాధాన్యం కల్పించాలని అమరరాజా సంస్థను కోరారు. పాలమూరులో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ వేలాది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీకి అత్యంత ప్రాధాన్యం ఏర్పడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 32 గిగావాట్ గంటల సామర్థ్యంతో అమరరాజా ఏర్పాటు చేసిన యూనిట్ దేశ పారిశ్రామిక రంగానికి కొత్త దిశ చూపుతుందని అన్నారు. సంస్థలో పనిచేస్తున్న 700 మంది ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం అభినందనీయమని కొనియాడారు. చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాలతో పోటీ పడుతున్న భారతీయ సంస్థగా అమరరాజా ఎదగడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రపంచ ఈవీ రంగంలో చైనా ఆధిపత్యానికి పోటీగా నిలిచే సామర్థ్యం అమరరాజాకు ఉందని, అలాంటి సంస్థలను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అమరరాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, ఎంపీ డీకే అరుణ, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# దేశానికి తెలంగాణ రోల్‌మోడల్

- ఫ్యూచర్ సిటీతో ప్రపంచ దృష్టి హైదరాబాద్ వైపు
- 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం
- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన



**హైదరాబాద్, జులై 15 (చురకలు):** రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతామని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ. 60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ ఇంట్లో ఏసీబీ దాడులు

మొదటి పేజీ తరువాయి

పాటు సాగిన తనిఖీల అనంతరం రవీందర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో హాజరుపరిచారు. నానక్‌రాంగూడలోని రవీందర్ నివాసంతో పాటు మరో పది ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించిన అధికారులు భారీ మొత్తంలో స్థిర, చరాస్తులకు సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆయనను వైద్య పరీక్షల కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, తర్వాత నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయంలో విచారించారు. ప్రాథమిక విచారణలో రవీందర్ పేరుపై నార్సింగి, నానక్‌రాంగూడలో నాలుగు నివాస ప్లాట్లు, శంషాబాద్--కొత్తూరు ప్రాంతంలో నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి, శంకర్‌పల్లి మోకిలాలో 300 చదరపు గజా విల్లా, కొడంగల్, కిష్టాపూర్, పసుమాముల ప్రాంతాల్లో ఐదు ప్లాట్లు, కొండాపూర్ మజిద్‌బండలో నాలుగు అంతస్తుల భవనం ఉన్నట్లు ఏసీబీ గుర్తించింది. అదనంగా నాలుగు కార్లు, రూ.4 లక్షల నగదు, రూ.45 లక్షల బ్యాంకు డిపాజిట్లు, 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు, సుమారు 12.5 కిలోల వెండి, రూ.10 లక్షల విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మూడు దశాబ్దాలుగా హెచ్‌ఎండీఏలో వివిధ హోదాల్లో పనిచేసిన రవీందర్, ఏడాది క్రితం చీఫ్ ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆయన పదవీకాలంలో ఎలివేటెడ్ కారిడార్ల టెండర్లు, ఔటర్ రింగ్ రోడ్ లీజు వంటి కీలక ప్రాజెక్టులు నిర్వహించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల ద్వారా అక్రమంగా భారీ ఆస్తులు కూడబెట్టినట్లు అనుమానిస్తున్న ఏసీబీ అధికారులు, ఆస్తుల మూలాలు, బ్యాంకు లావాదేవీలు, బినామీ పెట్టుబడులు, ఇతర సంబంధిత అంశాలపై లోతైన దర్యాప్తు కొనసాగిస్తున్నారు. విచారణలో మరిన్ని కీలక వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# సర్ నమోదు గడువు పెంపు

## ఆగస్టు 3 వరకు అవకాశం

## ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ విడుదల

## రాజకీయ పార్టీల విజ్ఞప్తితో పొడిగించిన గడువు

**హైదరాబాద్, జూలై 15 (చురకలు):** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియకు కేంద్ర ఎన్నికల సంఘం గడువు పొడిగించింది. ఈ నెల 24తో ముగియాల్సిన ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను ఆగస్టు 3 వరకు కొనసాగించాలని నిర్ణయించింది. అలాగే సవరించిన ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేస్తూ సెప్టెంబర్ 9 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌లు స్వీకరించి, అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితాను ప్రకటిస్తామని వెల్లడించింది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై అవగాహన కొరవడి ఉండడం, గడువు ముగియడానికి ముందే పెద్ద సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు గడువు పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరాయి. ఈ విజ్ఞప్తులను పరిశీలించిన అనంతరం ఎన్నికల సంఘం గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అక్టోబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తూ విడుదల చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం, జూన్ 25 నుంచి కొనసాగుతున్న ఇంటింటి సర్వే, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. ఇదే గడువులో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు కూడా పూర్తవుతాయి. ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు. అనంతరం కొత్త ఓటర్ల నమోదు, పేర్లు చేర్చడం, తొలగించడం, చిరునామా మార్పులు, ఇతర సవరణలకు సంబంధించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు స్వీకరిస్తారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులు, అభ్యంతరాలపై నోటీసులు జారీ చేసి విచారణలు నిర్వహించి, అక్టోబర్ 8 నాటికి పరిష్కార ప్రక్రియను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం అధికారులకు ఆదేశించింది. అనంతరం అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా విడుదల చేయనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది.

చురకలు



# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

- కేంద్రంతో నిరంతర సంప్రదింపులు: మంత్రి తుమ్మల
- సీతారామ, సీతమ్మసాగర్ పెండింగ్ అంశాలపై ఉత్తమ్‌తో సమీక్ష
- ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలే లక్ష్యం
- కాలువలు, సొరంగాలు, భూసేకరణ, పైప్‌లైన్ పనులు వేగవంతం చేయాలని నిర్ణయం



**హైదరాబాద్, జూలై 15(చురకలు):** అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ అంశాలపై బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సమావేశం అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల ప్రక్రియ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశాల కారణంగా నిలిచిపోయిందని తెలిపారు. ఈ న్యాయపరమైన చిక్కులను అధిగమించి అనుమతులు సాధించేందుకు కేంద్ర మంత్రులు, సంబంధిత శాఖలు, అధికారులతో అన్ని స్థాయిల్లో చర్చలు కొనసాగిస్తున్నామని చెప్పారు. అనుమతులు వచ్చిన వెంటనే ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులకు సాగునీరు అందిస్తామని స్పష్టం చేశారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్-1, పంప్‌హౌస్-2 మధ్య ఉన్న దోమలవాగు నిల్వ సామర్థ్యాన్ని 0.20 టీఎంసీల నుంచి 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై కూడా చర్చించినట్లు మంత్రి తెలిపారు. నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల ఎత్తిపోతల వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని వివరించారు. ఈ ప్రతిపాదనకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్-1, 2, 3 మధ్య అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్లు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. వరదల సమయంలో కాలువలకు నష్టం జరగకుండా నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఈ ఏర్పాట్లు దోహదపడతాయని అధికారులు వివరించారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తైందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి తుమ్మల తెలిపారు. 2026 ఆగస్టు నాటికి పనులు పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని చెప్పారు. నిర్మాణ సంస్థలకు పెండింగ్ బిల్లులు త్వరగా విడుదల చేయాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని తుమ్మల కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ హామీ ఇచ్చారు. అశ్వారావుపేట, సత్తుపల్లి ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం అధికంగా ఉండటంతో సంప్రదాయ కాలువలకు బదులుగా పైపుల ద్వారా సాగునీటి పంపిణీ సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జూలూరుపాడు సొరంగం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కూడా సమావేశంలో నిర్ణయించారు. పాలేరు జలాశయానికి వీలైనంత త్వరగా గోదావరి జలాలు చేరేలా చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ అధికారులను ఆదేశించినట్లు తుమ్మల వెల్లడించారు. సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని పెండింగ్ అంశాలను సమన్వయంతో పరిష్కరించి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులకు త్వరితగతిన సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇరువురు మంత్రులు స్పష్టం చేశారు.

# తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా ఆషాఢ బోనాలు

- నేటి నుంచి బోనాల మహోత్సవాలు ప్రారంభం
- గోల్కొండ జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో వేడుకలకు శ్రీకారం
- ఉత్సవాల నిర్వహణకు రూ.20 కోట్లు.. అన్ని ఏర్పాట్లు పూర్తి
- అమ్మవారి కటాక్షంతో వర్షాభావం తొలగి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించిన మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్, జూలై 15 (చురకలు):** తెలంగాణ ఆత్మను, సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ఆషాఢ బోనాల ఉత్సవాలు రాష్ట్ర ప్రజల ఐక్యతకు, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఆషాఢ బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. జూలై 16 నుంచి ప్రారంభమయ్యే బోనాల ఉత్సవాలను హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని సుమారు మూడు వేలకుపైగా దేవాలయాల్లో ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని మంత్రి తెలిపారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పణతో వేడుకలు ప్రారంభమై, ఆగస్టు 13న హరిబౌలిలోని అక్కన్న-మాదన్న మహంకాళి ఆలయంలో బోనాల సమర్పణ, ఘటాల నిమజ్జనంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో జరిగే బోనాల ఉత్సవాలు తెలంగాణ గంగా-జమున సంస్కృతికి ప్రతీకగా నిలుస్తాయని, లౌకిక స్ఫూర్తిని చాటుతాయని మంత్రి అన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.20 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించడం పట్ల మంత్రి కొండా సురేఖ కృతజ్ఞతలు తెలిపారు. భక్తులు సౌకర్యవంతంగా అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించి సురక్షితంగా తిరిగి స్వగృహాలకు చేరుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పొలాలు పచ్చగా కళకళలాడాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు.

# తుంగతుర్తి వ్యవహారంలో వేలు పెట్టను

## జగ్గారెడ్డితో మంత్రి కోమటిరెడ్డి భేటీ

## గెలుపు లక్ష్యంగా పనిచేయాలని హితవు

**హైదరాబాద్, జూలై15:** తుంగతుర్తిలో నెలకొన్న వివాదాన్ని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి చూసుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోబోనని స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని కోమటిరెడ్డి నివాసంలో ఆయనతో జగ్గారెడ్డి భేటీ అయ్యారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవుల విషయంలో నెలకొన్న వివాదంపై చర్చించారు. కోమటిరెడ్డితో భేటీ అనంతరం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. తుంగతుర్తి అంశంలో కలగజేసుకునేందుకు కోమటిరెడ్డి ఆసక్తి చూపించడం లేదన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కావాలంటే వరుసగా మూడేళ్లు పార్టీ కార్యకర్తగా కొనసాగాలనే ఏఐసీసీ నిబంధన ఉందన్నారు. తుంగతుర్తిలో మూడు, నాలుగు మండలాల్లో ఆ నిబంధనల ప్రకారం నియామకాలు జరగలేదన్నారు. ఈ వ్యవహారంపై ఈనెల 20లోపు నివేదిక ఇస్తానని తెలిపారు. ఇకపోతే చ్చే ఎన్నికల్లో తమ టా÷-గ్గ్ ÷ట్ 120 సీట్లని... దక్షిణ తెలంగాణ, ఉత్తర తెలంగాణ స్వీప్ చేస్తామని అన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. బుధవారం కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ ఈమేరకు కీలక వ్యాఖ్యలు చేశారు మంత్రి కోమటిరెడ్డి. రాహుల్ గాంధీ ప్రధాని కావడం తమ లక్ష్యమని... రాహుల్ గాంధీ గెలుపు కోసం అందరు కలిసి పని చేయాలని అన్నారు. కొంతమంది మంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్లారని... తాను మంత్రి పదవి కోసం ఢిల్లీకి వెళ్లలేదని అన్నారు మంత్రి కోమటిరెడ్డి. తుంగతుర్తి విషయం అన్ని తెలిసిన వ్యక్తి జగ్గారెడ్డి చూసుకుంటారని.. లోకల్ ఎమ్మెల్యే అందరితో సమన్వయం చేసుకుంటాడని అన్నారు. .రోడ్ల మీదకు వచ్చి కొట్టుకోవద్దని... సమస్యలు ఉంటే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ దృష్టికి తేవాలని అన్నారు కోమటిరెడ్డి. 35ఏండ్ల నుండి ప్రజా జీవితంలో ఉన్నానని... 13వేల కోట్ల నిధులు,7వేల కోట్ల పంచాయితీ రాజ్ రోడ్లకు నిధులు తీసుకొచ్చానని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణ లో రోడ్లు వేస్తున్నామని... గడ్కరీతో మాట్లాడి 2వేల కోట్ల సీఆర్‌ఎఫ్ ఫండ్స్ తెచ్చానని అన్నారు కోమటిరెడ్డి. జగ్గారెడ్డి రెడ్డి ని రాహుల్ గాంధీ ఇష్టపడతారని.. జగ్గారెడ్డి పేదల మనిషి,మాస్ లీడర్ అని... అందరికి సాయం చేస్తారని కొనియాడారు. సిద్దిపేట లో జగ్గారెడ్డి పోటీ చేస్తే పూర్తిగా తమ మద్దతు ఉంటుందని అన్నారు. హరీష్ రావు, రఘునందన్ రావు మీద రెండు వేల మెజారిటీ తో మాత్రమే గెలిచిందని అన్నారు.



## విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిరోధానికి

# కఠిన చర్యలు

## జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాల్సిందే

## ఈగిల్ అధికారులకు డిజిపి ఆనంద్ సూచన

**హైదరాబాద్, జూలై 15:** విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలు చేయాలని ఈగల్ విభాగంలోని అధికారులకు తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. డ్రగ్స్ నిరోధించడంపై బుధవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో ఈగల్ అధికారులతో సి.వి. ఆనంద్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో 'యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కో ఆర్డినేటర్ నియామకం తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు. డ్రగ్స్ నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని.. అవసరమైతే గుర్తింపును రద్దు చేసేందుకు సిఫార్సు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతతోపాటు డ్రగ్స్ నివారణ చర్యలపై సేఫ్టీ కమిటీలు ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ నియంత్రణలో పోలీసు, విద్య, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశించారు. విద్యార్థులకు సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వివరించారు. ÷రిలీసు, విద్య, ఆరోగ్య శాఖల సమన్వయంతో డ్రగ్స్ రహిత తెలంగాణెలి లక్ష్యమని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. డ్రగ్స్ రహిత విద్యాసంస్థల కోసం త్వరలోనే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (÷ాక్షఖబ) విడుదల చేయనున్నారు. ప్రభుత్వానికి తుది ప్రతిపాదనలు సమర్పించే ముందు మరోసారి సమీక్ష సమావేశం నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

## టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన



**హైదరాబాద్, జులై 15(చురకలు):** ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్ ÷నైల్ అని స్పష్టం చేశారు. ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానికగా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

## బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే

# లీగల్ నోటీసుకు కౌంటర్

## ఆరోపణలు నిరాధారమంటూనే క్షమాపణలు



**న్యూఢిల్లీ:** బీజేపీ ఎంపీ డాక్టర్ నిషికాంత్ దూబే తరఫు న్యాయవాదులు రిషి కె. అవస్థీ, కృష్ణ కన్హయ్య పాల్ పంపిన లీగల్ నోటీసుకు ధీటుగా సమాధానం పంపారు. ఆ నోటీసులో పేర్కొన్న ఆరోపణలన్నీ పూర్తిగా నిరాధారమని, చట్టపరంగా ఎక్కడా నిలవవని స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (ట్విట్టర్)లో చేసిన వ్యాఖ్యలు ఎవరినీ వ్యక్తిగతంగా అవమానించాలనే ఉద్దేశంతో చేసినవి కావని సమాధానంలో పేర్కొన్నారు. సదరు లీగల్ నోటీసు అందే వరకు సంబంధిత వ్యక్తి గురించి తనకు ఎలాంటి వ్యక్తిగత పరిచయం కూడా లేదని స్పష్టం చేశారు. అయితే, తమ వ్యాఖ్యల వల్ల అనుకోకుండా ఎవరి మనోభావాలైనా దెబ్బతిని ఉంటే హృదయపూర్వకంగా క్షమాపణలు తెలియజేస్తున్నట్లు వెల్లడించారు. ఇదే సమయంలో ఈ క్షమాపణను చట్టపరమైన తప్పుగానో లేదా బాధ్యతను అంగీకరించినట్లుగానో ఎట్టి పరిస్థితుల్లోనూ భావించరాదని స్పష్టం చేశారు. ఈ వివాదానికి సంబంధించి తమకున్న అన్ని చట్టపరమైన హక్కులు భవిష్యత్తులో యథాతథంగా కొనసాగుతాయని, వాటిని రిజర్వ్ చేసుకుంటున్నట్లు సమాధాన నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు.

## అమెరికాలో హత్యకు గురైన

# మేడ్చల్ యువకుడి కేసు

## 14 ఏళ్ల బాలుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్, జూలై 15:** అమెరికాలో హత్యకు గురైన తెలంగాణకు చెందిన యువకుడు కుంచ అన్షుల్ కేసులో 14 ఏళ్ల బాలుడిని అగ్రరాజ్య పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. ఫిలడెల్ఫియాకు చెందిన నిందితుడిని హత్య, దొంగతనం అభియోగాలపై జులై 10న అరెస్ట్ చేసినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. అయితే, ఘటన సమయంలో ఆ బాలుడితో ఉన్న మరో వ్యక్తి ఎవరన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదని తెలిపారు. ఆ వ్యక్తి కోసం గాలింపు చేపట్టామని, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. నార్త్ ఫిలడెల్ఫియాలో జూన్ 5న అన్షుల్ హత్యకు గురయ్యాడు. ఎడ్గ్లీ స్ట్రీట్‌లో నిర్మానుష్యంగా ఉన్న ఓ ఇంటికి పిజ్జాలు డెలివరీ ఇచ్చేందుకు వెళ్లిన అతడిపై దుండగులు దాడి చేశారు. తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అన్షుల్‌ను ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. చోరీ కోసమే దుండగులు దాడి చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఉద్దేశపూర్వకంగానే పిజ్జాలు ఆర్డర్ చేసి కాల్పులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లికి చెందిన అన్షుల్.. 2023లో అమెరికా వెళ్లాడు. కేడబ్ల్యూసీ సంస్థలో ఉద్యోగం చేస్తూ.. అదనపు ఆదాయం కోసం వారాంతాల్లో పిజ్జా డెలివరీ బాయ్‌గా పనిచేసేవాడని కుటుంబసభ్యులు తెలిపారు.

# 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

## బీజేపీ అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి




**హైదరాబాద్, జూలై 15:** వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందోన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.



# నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారం

## ఎల్‌నినో సవాళ్లకు జాతీయ జల విధానమే సమాధానం

## పార్లమెంట్‌లో రాజకీయాలకే కాదు.. నీటి భద్రతకూ ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు,సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్దతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్దం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది. వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి.

# ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం

- రూ.2.19 లక్షల కోట్లకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్
- సెమీకండక్టర్లు, మొబైల్ తయారీ, వారణాసి అభివృద్ధికి భారీ ఊతం
- ఎరువుల స్వయం సమృద్ధి.. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణకు నిర్ణయాలు



**న్యూఢిల్లీ, జూలై 15(చురకలు):** దేశ పారిశ్రామిక, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో మొత్తం రూ.2,19,353 కోట్ల విలువైన ఏడు కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. సెమీకండక్టర్ల తయారీలో భారత్‌ను ప్రపంచ కేంద్రంగా తీర్చిదిద్దడం, మొబైల్ తయారీని విస్తరించడం, ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి సాధించడం, వారణాసిలో భారీ మౌలిక సదుపాయాల కల్పన, రైల్వే నెట్‌వర్క్ బలోపేతం వంటి నిర్ణయాలకు క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను వెల్లడించారు. భారత్‌ను అంతర్జాతీయ చిప్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సెమీకండక్టర్ మిషన్--2.0కు రూ.1,27,500 కోట్ల భారీ కేటాయింపును క్యాబినెట్ ఆమోదించింది. దీని ద్వారా దేశంలో అత్యాధునిక సెమీకండక్టర్ తయారీ, రూపకల్పన, ప్యాకేజింగ్ పరిశ్రమలకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభించనుంది. ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాన్ని మరింత విస్తరించేందుకు మొబైల్ ఫోన్ తయారీ ప్రోత్సాహక పథకంకు రూ.62,500 కోట్లను కేటాయించారు. ఈ పథకం అమలుతో దేశీయ మొబైల్ ఉత్పత్తి పెరగడంతో పాటు వేలాది ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ఎరువుల రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యంగా యూరియా జాతీయ పెట్టుబడి విధానం--2026కు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశీయ యూరియా ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశం. దీనికి ప్రత్యేక నిధుల కేటాయింపు లేకపోయినా విధానపరమైన అనుమతి లభించింది. వారణాసి నగర అభివృద్ధికి రూ.25,446 కోట్ల విలువైన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వరుణా నది వెంబడి రూ.10,998 కోట్లతో ఆరు, నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్, గంగా నది వెంబడి రూ.14,448 కోట్లతో ఆరు లేన్ల అత్యాధునిక ఎలివేటెడ్ కారిడార్ నిర్మించనున్నారు. రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణలో భాగంగా రెండు కీలక ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. పారాదీప్--హరిదాస్‌పూర్ రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు రూ.2,542 కోట్లు, డాంగోవాపోసి-రాజ్‌ఖర్సవాన్ మార్గంలో నాలుగో రైల్వే లైన్ నిర్మాణానికి రూ.1,365 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాలు పారిశ్రామిక వృద్ధితో పాటు మౌలిక సదుపాయాల విస్తరణ, రైతులకు ఎరువుల భద్రత, దేశీయ తయారీ సామర్థ్య పెంపు, ఉపాధి అవకాశాల సృష్టికి దోహదపడతాయని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. సెమీకండక్టర్, మొబైల్ తయారీ రంగాల్లో ఈ నిర్ణయాలు ప్రపంచ మార్కెట్లో భారతదేశ పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఆయన పేర్కొన్నారు.

# సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యంపై పిల్




- కేంద్రానికి ఢిల్లీ హైకోర్టు నోటీసులు!
- వేగంగా క్షీణిస్తున్న సామాజిక కార్యకర్త ఆరోగ్యం
- ఇప్పటికే 8.5 కిలోల బరువు తగ్గినట్లు కోర్టుకు తెలిపిన పిటిషనర్
- తక్షణ వైద్య సహాయంపై నివేదిక ఇవ్వాలని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వాలకు ఆదేశం

**న్యూఢిల్లీ, జూలై 15(చురకలు):** ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం నిరవధిక నిరాహార దీక్ష కారణంగా వేగంగా క్షీణిస్తుండటంపై ఢిల్లీ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆయన ప్రాణాలను కాపాడేందుకు తక్షణ వైద్య సహాయం అందించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని న్యాయస్థానం అత్యవసరంగా విచారించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి, ఢిల్లీ ప్రభుత్వానికి హైకోర్టు కీలక నోటీసులు జారీ చేసింది. వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితిపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికను సమర్పించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వేదికగా సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు. దీక్ష కారణంగా ఆయన శరీరం తీవ్రంగా సహకరించడం లేదని, ఇప్పటికే దాదాపు 8.5 కిలోల బరువు తగ్గారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆయన ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని, వైద్యుల పర్యవేక్షణలో అవసరమైతే బలవంతంగానైనా ద్రవాహారం (లిక్విడ్ డైట్) అందించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోర్టును అభ్యర్థించారు. విద్యా వ్యవస్థలో జరుగుతున్న పలు అవకతవకలకు వ్యతిరేకంగా సాగుతున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' ఉద్యమానికి మద్దతుగా సోనమ్ వాంగ్‌చుక్ ఈ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. విద్యా రంగంలో సంస్కరణలు కోరుతూ ఆయన చేస్తున్న ఈ దీక్ష దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తిస్తున్న నేపథ్యంలో, హైకోర్టు జోక్యం చేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం వాయిదా వేసింది.

# అయోధ్య విరాళాల వివాదం

- 'నేను పారిపోయే వాడిని కాదు'
- ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి స్పష్టీకరణ
- రూ. మూడు కోట్ల నగదు గోల్‌మాల్‌పై ఎస్‌బీఐపైనే విమర్శలు
- బంగారం మాయమైందన్న ప్రచారాన్ని ఖండించిన ట్రస్ట్



**అయోధ్య, జూలై 15(చురకలు):** అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ విరాళాల దుర్వినియోగం వ్యవహారంపై ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ గిరి మహారాజ్ స్పందించారు. ఈ వివాదం నేపథ్యంలో తాను రాజీనామా చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన ఖండించారు. తాను ఎక్కడికీ పారిపోయే వ్యక్తిని కాదని, ఛత్రపతి శివాజీ మహారాజ్ అనుచరుడిగా సమస్యను ధైర్యంగా ఎదుర్కొంటానని, బాధ్యతల నుంచి తప్పుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. విరాళాల గోల్‌మాల్‌కు సంబంధించి అరెస్టయిన వారంతా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నియమించిన సిబ్బందేనని, వారి నియామకాలు, నేపథ్య పరిశీలన బాధ్యత బ్యాంకుదేనని ఆయన ఆరోపించారు. సుమారు రూ. మూడు కోట్ల మేర నగదు గోల్‌మాల్ జరిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నామని, అయితే అది బ్యాంకు ఖాతాల్లోని నిధులు కాదని, విరాళాల పెట్టెల్లో వచ్చిన నగదేనని వివరించారు. ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ రాజీనామా పూర్తిగా స్వచ్ఛందమని, ఆయన వ్యవహారశైలిలో నిర్లక్ష్యం ఉన్నప్పటికీ బలిపశువుగా మార్చలేదని గోవింద్ దేవ్ గిరి పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సిబ్బందికి జేబులు లేని యూనిఫాంలు అందించడం, సీసీటీవీ నిఘాను మరింత బలోపేతం చేయడం, విరాళాల నగదు లెక్కింపును ట్రస్ట్, బ్యాంకు అధికారుల సంయుక్త పర్యవేక్షణలో నిర్వహించడం వంటి కఠిన చర్యలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే రూ.1,400 కోట్ల విలువైన బంగారం మాయమైందన్న ప్రచారాన్ని పూర్తిగా ఖండించిన ఆయన, ఆ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ కొనసాగుతోంది.

# స్విగ్గీ ఇన్‌స్టామార్ట్‌లో గ్యాస్ సిలిండర్లు

- 10 నిమిషాల్లోనే ఇంటికి..
- దేశంలోనే తొలిసారిగా సరికొత్త సేవలు!

**బెంగళూరు, జూలై 15(చురకలు):** ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ ఉన్న వారు రీఫిల్ బుక్ చేసుకుంటే డెలివరీ కావడానికి రెండు మూడు రోజులు పడుతోంది. అయితే, ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా కేవలం పది నిమిషాల్లోనే గ్యాస్ సిలిండర్‌ను ఇంటికి చేరవేసే సరికొత్త విధానం త్వరలోనే బెంగళూరు వాసులకు అందుబాటు లోకి రానుంది. ఇందుకోసం ప్రముఖ క్విక్ కామర్స్ వేదిక 'స్విగ్గీ ఇన్‌స్టామార్ట్'తో ప్రభుత్వ రంగ చమురు సంస్థ 'హెచ్‌పీసీఎల్' కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా, హెచ్‌పీసీఎల్‌కు చెందిన 10 కేజీల 'నవ్య' సిలిండర్లను బుక్ చేసుకున్న 10 నిమిషాల్లోనే కస్టమర్ల ఇళ్లకు డెలివరీ చేయనున్నారు. గ్యాస్ కనెక్షన్ లేని వారు, చిన్న కుటుంబాలు, బ్యాచిలర్స్, విద్యార్థులకు అనువుగా ఉండేలా ఈ నవ్య గ్యాస్ సిలిండర్‌లను రూపొందించారు. సాధారణ స్టీల్ సిలిండర్‌ల కంటే భిన్నంగా, వీటిని అత్యాధునిక కాంపోజిట్ పాలిమర్‌తో తయారు చేశారు. పాక్షిక పారదర్శకంగా ఉండే ఈ సిలిండర్లలో గ్యాస్ ఎంత మిగిలి ఉందో బయటి నుంచే చూసి తెలుసుకోవచ్చు. పైగా, ఇవి సాధారణ స్టీల్ సిలిండర్ల కంటే 50 శాతం తక్కువ బరువు ఉంటాయి. త్వరితగతిన బుక్ చేసుకునే సదుపాయం ఉన్నప్పటికీ, భద్రతా ప్రమాణాల దృష్ట్యా ఈ సిలిండర్‌లను సాధారణ గ్యాస్ ఏజెన్సీలకు చెందిన నిపుణులైన సిబ్బంది ద్వారానే డెలివరీ చేయనున్నట్లు హెచ్‌పీసీఎల్ స్పష్టం చేసింది. మొదటి సారి బుక్ చేసుకునే కస్టమర్ల నుంచి అవసరమైన అన్ని ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న తర్వాతే సిలిండర్ కేటాయిస్తారు. ఆ తర్వాతి బుకింగ్‌లను రీఫిల్‌గా పరిగణిస్తారు. రీఫిల్ డెలివరీ తీసుకునే సమయంలో కస్టమర్లు తమ వద్ద ఉన్న ఖాళీ నవ్య సిలిండర్‌ను సిబ్బందికి తిరిగి ఇచ్చేయాల్సి ఉంటుంది. ఎల్‌పీజీ సిలిండర్‌లను మరింత సులభంగా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకే ఈ వినూత్న సేవలను ప్రారంభిస్తున్నట్లు హెచ్‌పీసీఎల్ మార్కెటింగ్ డైరెక్టర్ అమిత్ గర్గ్ తెలిపారు. కాగా, ఈ సేవలను ఇతర నగరాలకు ఎప్పుడు విస్తరిస్తారనే వివరాలను సంస్థ ఇంకా వెల్లడించలేదు.



# డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన

- ప్రజల సమస్యలను నేరుగా విన్న ఎస్పీ... త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ:
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, IPS

**నారాయణపేట, జులై,15**




నారాయణపేట జిల్లా ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆధ్వర్యంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి మొత్తం 25 ఫోన్ కాల్స్ అందినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.బుధవారం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన బాధితులు,ఫిర్యాదుదారులు నేరుగా జిల్లా ఎస్పీకి ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు.ప్రజలు ప్రధానంగా గ్రామాల్లో గుడుంబా తయారీ, విక్రయాలను అరికట్టడం, బెల్ట్ షాపులను మూసివేయడం, భూ తగాదాలు, ట్రాఫిక్ సమస్యలు, అక్రమ మద్యం విక్రయాలు, పాన్ షాపుల్లో గుట్కాల విక్రయాలు, రాత్రి వేళల్లో మద్యం సేవించి గొడవలు చేయడం,ఎస్సై ఫిర్యాదు స్వీకరించలేదనే ఆరోపణలు, కానిస్టేబుల్ భూ వివాదాల్లో జోక్యం చేసుకోవడం, పెండింగ్ దొంగతనాల కేసుల దర్యాప్తు, ఓపెన్ డ్రింకింగ్, రాత్రి పెట్రోలింగ్ పెంచడం, చీటింగ్ కేసులు వంటి అంశాలపై ఫిర్యాదులు చేశారు.అలాగే మరికల్ మండలం తిలేరు గేట్ వద్ద ప్రజల భద్రత కోసం బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని, రేడియం స్టిక్కర్లు అమర్చాలని విజ్ఞప్తి చేశారు. నారాయణపేట పట్టణంలోని ఓల్డ్ బస్టాండ్, యాద్గిరి రోడ్, సరాఫ్ బజార్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఉట్కూర్ లో కొంతమంది రౌడీ షీటర్లు, కమ్యూనల్ షీటర్ల జాబితాలో ప్రమేయం లేని అమాయకుల పేర్లు ఉన్నాయనే ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ, సమగ్ర విచారణ నిర్వహించి అర్హులైన వారి పేర్లను జాబితా నుంచి తొలగించే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మక్తల్‌లో కారు మిస్సింగ్ కేసు, వెండి ఆభరణాల చోరీ కేసు, మద్దూరులో బెల్ట్ షాపులు, ఓపెన్ డ్రింకింగ్, గొర్రెల చోరీ కేసులు, భూ వివాదాలకు సంబంధించిన పలు ఫిర్యాదులు కూడా అందాయి. ఈ సందర్భంగా ఒక వ్యక్తి ఫోన్ ద్వారా స్పందిస్తూ, "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైందని, ఇలాంటి ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమాలను నిర్వహిస్తున్న జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS కు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS మాట్లాడుతూ... ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును స్వయంగా నమోదు చేసి సంబంధిత పోలీస్ అధికారులకు వెంటనే పంపించామని తెలిపారు. ప్రతి సమస్యను నిష్పక్షపాతంగా విచారించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఎలాంటి సమస్య ఉన్నా ప్రజలు నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఇలాంటి "డయల్ యువర్ ఎస్పీ" కార్యక్రమాలను తరచుగా నిర్వహించి ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలను నేరుగా పోలీస్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

# జవహర్‌నగర్ డంప్‌యార్డ్ ఉద్యమానికి ఈటల సంపూర్ణ మద్దతు

- ప్రజలతో కలిసి పోరాటానికి సిద్ధం.. పార్లమెంట్‌లోనూ ప్రస్తావిస్తానన్న ఎంపీ

**హైదరాబాద్, జూలై 15**



జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న అఖిలపక్ష నేతలు, జేఏసీ నాయకులు, స్థానిక ప్రజలు బుధవారం శామీర్‌పేటలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి ఉద్యమానికి నాయకత్వం వహించాలని కోరారు. 20 ఏళ్లుగా డంప్‌యార్డ్ కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పార్టీలకు అతీతంగా తమకు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై తన సంపూర్ణ మద్దతు ఉంటుందని, ప్రజల్లో ఒకరిగా ఉద్యమానికి నాయకత్వం వహించేందుకు సిద్ధమని ప్రకటించారు. గతంలో కుదిరిన ఒప్పందాల అమలు లేకపోవడంతో డంప్‌యార్డ్ పరిసరాలు విషవలయంగా మారాయని, ఇది మూసీ కంటే అధ్వాన్నంగా మారిందని విమర్శించారు. ఉద్యమకారుల అరెస్టులతో సమస్యలు పరిష్కారం కావని, ప్రజాశక్తి ముందు ఎవరూ పెద్దవారు కాదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. అవసరమైతే ఈ అంశాన్ని పార్లమెంట్‌లో కూడా ప్రస్తావిస్తానని, డంప్‌యార్డ్ తొలగించే వరకు ప్రజల వెంటే ఉంటానని ఈటల భరోసా ఇచ్చారు.

# అమెజాన్ డేటా సెంటర్‌తో తెలంగాణకు కొత్త ఊపు: సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూలై 15:**




అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమం ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి, భారీ పెట్టుబడుల ఆకర్షణకు కీలక మైలురాయిగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2025లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 108 దేశాల నుంచి కార్పొరేట్ ప్రతినిధులను ఆకర్షించామని తెలిపారు. 2034 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకోసం పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టికి అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు, అనుమతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అమెజాన్ సంస్థ 2034 నాటికి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని ఆకాంక్షిస్తూ, ప్రతి నెల ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఫ్యూచర్ సిటీ, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, పరిశ్రమలు, పర్యాటకం, ఆరోగ్యం, ఎనర్జీ, క్రీడలకు ప్రత్యేక విధానాలతో తెలంగాణను అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. హైదరాబాద్‌ను కాలుష్యరహిత నగరంగా మార్చేందుకు ఎలక్ట్రిక్ బస్సులు, ఈవీ ప్రోత్సాహకాలు, మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళన వంటి చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఫ్యూచర్ సిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వారికి తగిన నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతుల ఆందోళనలపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కె. లక్ష్మారెడ్డికి సూచించారు. చివరగా, అమెజాన్ తెలంగాణలో తన పెట్టుబడులను మరింత విస్తరించాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్ సమస్యలపై ప్రధాన ఎన్నికల అధికారికి వినతి..

మూడు కీలక ప్రతిపాదనలు చేసిన ప్రెస్ క్లబ్ ఫ్రైడే ఈవెనింగ్ టీమ్

**హైదరాబాద్, జూలై 15**



ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (SIR) సందర్భంగా తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రెస్ క్లబ్ హైదరాబాద్ ఫ్రైడే ఈవెనింగ్ టీమ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. సమావేశంలో ఓటర్ల పేర్ల తొలగింపు, స్పెల్లింగ్ తప్పులు, 2002 ఓటరు జాబితా వివరాల గుర్తింపులో ఇబ్బందులు, బహుభాషా నమోదుల్లో అసమానతలు, బీఎల్ఓలకు తగిన శిక్షణ లేకపోవడం వంటి అంశాలను ప్రతినిధి బృందం ప్రస్తావించింది. శాశ్వత నివాస ధృవీకరణ పత్రం జారీ, SIR గడువు పొడిగింపు, నమోదు ప్రక్రియను మరింత సరళీకరించడం వంటి మూడు కీలక ప్రతిపాదనలను బృందం ముందుంచింది. ముఖ్యంగా వృద్ధులు, తక్కువ అక్షరాస్యత కలిగిన వారు, కంప్యూటర్ పరిజ్ఞానం లేని ఓటర్లకు సులభమైన విధానం అవసరమని పేర్కొంది. ఎమ్మెల్సీ కోదండరాం, సీనియర్ జర్నలిస్టులు కొండుభట్ల రామచంద్రమూర్తి, మల్లెపల్లి లక్ష్మయ్య, దేవులపల్లి అమర్ తదితరులతో కూడిన ప్రతినిధి బృందం సమావేశంలో పాల్గొంది. బృందం లేవనెత్తిన అంశాలను ఓపికగా విన్న ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు.

# జర్నలిస్టుల సమస్యలపై టీడబ్ల్యూజేఎఫ్ 'ఛలో సమాచార్ భవన్' ధర్నా

**హైదరాబాద్, జూలై 15**




రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) బుధవారం హైదరాబాద్‌లోని సమాచార, పౌరసంబంధాల శాఖ (ఐ&పీఆర్) రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎదుట 'ఛలో సమాచార్ భవన్' కార్యక్రమం నిర్వహించి ధర్నా చేపట్టింది. ఇప్పటికే కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పించడం, జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం, అధికారుల నుంచి స్పందన లేకపోవడంతో ఈ ఆందోళన చేపట్టినట్లు నాయకులు తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు:** కోటాలతో సంబంధం లేకుండా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేయాలి. జర్నలిస్టులకు ఇళ్లు లేదా ఇంటి స్థలాలు కేటాయించి ప్రక్రియను వేగవంతం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో హెల్త్ కార్డులు అందించాలి. ఆర్టీసీ, మెట్రో రైళ్లలో పూర్తి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి.

# హైదరాబాద్‌లో బ్రిక్స్ కార్మిక మంత్రుల సమావేశం




**హైదరాబాద్, జూలై 15**

: భారత అధ్యక్షతన హైదరాబాద్‌లో జరుగుతున్న 12వ బ్రిక్స్ కార్మిక & ఉపాధి మంత్రుల సమావేశం బుధవారం ప్రారంభమైంది. కేంద్ర కార్మిక & ఉపాధి శాఖ మంత్రి డా. మన్సుఖ్ మాండవీయ సమావేశానికి అధ్యక్షత వహించారు. కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజేతో పాటు బ్రిక్స్ దేశాల కార్మిక మంత్రులు, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. భారత అధ్యక్షతలో సామాజిక భద్రత విస్తరణ, కార్మిక మార్కెట్ల అధికారికీకరణ, మహిళల ఉపాధి భాగస్వామ్యం పెంపు, ఉపాధి నైపుణ్యాల అభివృద్ధి, గిగ్ మరియు ప్లాట్‌ఫార్మ్ కార్మికులతో సహా అన్ని వర్గాల కార్మికులకు డిజిటల్ సాంకేతికత వినియోగం వంటి నాలుగు కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి.

# SIRపై ప్రభుత్వ నిర్లక్ష్యం: తలసాని విమర్శ

**హైదరాబాద్, జూలై 15 :**

ప్రత్యేక ఓటరు సవరణ (SIR) ప్రక్రియ పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బుధవారం సనత్‌నగర్‌లోని సుభాష్‌నగర్ SIR హెల్ప్ డెస్క్‌ను సందర్శించిన ఆయన, 2002 సంవత్సరం వివరాలు ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించారు. హెల్ప్ డెస్క్‌లలో సరిపడా సిబ్బందిని నియమించలేదని, ఎన్యుమరేటర్లకు ఫారాలు నింపే విషయంలో కనీస అవగాహన కూడా లేదని ఆరోపించారు. సర్వే పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలంటే ఒక్కో బూత్‌కు నాలుగు బృందాలను ఏర్పాటు చేసి, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందిని విధుల్లో నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

# ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం:

ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, జూలై 15**

భారత్–యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (CETA), సామాజిక భద్రత ఒప్పందం అమల్లోకి రావడం ఇరు దేశాల భాగస్వామ్యంలో కీలక మైలురాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ ఒప్పందాలతో భారత్–యూకే ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని, ఇరు దేశాల ఉమ్మడి లక్ష్యాలు ప్రజలకు స్పష్టమైన అవకాశాలుగా మారతాయని తెలిపారు. సీఈటీఏ వల్ల భారత రైతులు, పారిశ్రామికవేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (MSMEs) యూకే మార్కెట్లో మెరుగైన అవకాశాలు లభిస్తాయని ప్రధాని అన్నారు. అలాగే సాంకేతికత, వృత్తిపర సేవలు, ఆవిష్కరణల రంగాల్లో సహకారం పెరగడంతో పాటు భారత నైపుణ్య వృత్తి నిపుణులకు మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. సామాజిక భద్రత ఒప్పందం ద్వారా యూకేలో తాత్కాలికంగా పనిచేస్తున్న భారతీయ నిపుణులకు ప్రయోజనం చేకూరుతుందని, భారత సంస్థల పోటీతత్వం కూడా పెరుగుతుందని ప్రధాని పేర్కొన్నారు. వాణిజ్యం, సాంకేతికత, పెట్టుబడులు, ఆవిష్కరణల రంగాల్లో భారత్–యూకే భాగస్వామ్యం మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# పెద్దపల్లిజిల్లా యువతకు ఎస్ఐ, కానిస్టేబుల్ ఉచిత శిక్షణ

**పెద్దపల్లి, జూలై 15**

ఎస్ఐ, కానిస్టేబుల్ నియామక పరీక్షలకు సిద్ధమవుతున్న పెద్దపల్లి జిల్లా యువత కోసం జూలై 19న గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో "పోలీస్ యువశక్తి" ఉచిత శిక్షణ ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఎంపికైన వారికి ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్, ఫిజికల్ ట్రైనింగ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 17లోపు నమోదు చేసుకోవాలని సూచించారు.

# ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, జూలై 15**



ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణ గడువు సమీపిస్తున్నందున ఓటర్లు ఆలస్యం చేయకుండా బీఎల్ఓలకు ఫారాలు అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. 2002 వివరాలు తెలియకపోయినా ప్రస్తుత ఓటరు వివరాలతో ఫారం సమర్పించవచ్చని, అనంతరం ఈఆర్ఓ విచారణలో అవసరమైన గుర్తింపు పత్రం చూపిస్తే తుది ఓటరు జాబితాలో పేరు చేర్చుతారని తెలిపారు. బీఎల్ఏలు రోజుకు కనీసం 50 ఫారాలు సేకరించి బీఎల్ఓలకు అందించాలని, అధికారులు ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే అందుబాటులో లేని, మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, రెండు చోట్ల ఓటు ఉన్న వారి జాబితాను సిద్ధం చేయాలని సూచించారు.

చురకలు

గురువారం 16 జూలై 2026

## నిజామాబాద్ నుంచి యూకేకు సోనా మసూరి బియ్యం ఎగుమతులు ప్రారంభం




**నిజమాబాద్ జూలై15**

నిజామాబాద్‌లోని గజానన్ రైస్ మిల్ నుంచి యునైటెడ్ కింగ్‌డమ్‌కు సోనా మసూరి ఎగుమతి నాణ్యత బియ్యం రవాణాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జెండా ఊపి ప్రారంభించారు. భారత్–యూకే సీఈటీఏ (CETA) ఒప్పందంతో లభిస్తున్న అవకాశాలను వినియోగించుకుని ఈ ఎగుమతులు చేపట్టినట్లు తెలిపారు. దీని ద్వారా రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు నిజామాబాద్ జిల్లాకు అంతర్జాతీయ గుర్తింపు పెరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని దేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు విస్తరించేలా అధికారులు, ఎగుమతి దారులు కలిసి పనిచేయాలని సూచించారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలుకు క్షేత్రస్థాయి పరిశీలన

**హైదరాబాద్, జూలై 15:**

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రతిపాదించిన వన్‌వే విధానంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు ఉన్న ప్రాంతాల్లో రోడ్ల విస్తరణ, పెలికాన్ సిగ్నల్స్, లేన్ మార్కింగ్‌లు, ఇతర సివిల్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వన్‌వే విధానాన్ని త్వరలో అమలు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రజలు సహకరించాలని జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు విజ్ఞప్తి చేశారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే అమలుకు క్షేత్రస్థాయి పరిశీలన



**హైదరాబాద్, జూలై 15**

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గించి వాహనాల రాకపోకలను సులభతరం చేసేందుకు ప్రతిపాదించిన వన్‌వే విధానంపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ తదితర ఉన్నతాధికారులు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉదయం రెండు గంటల పాటు సుమారు ఐదు కిలోమీటర్లు కాలినడకన తిరిగి ప్రధాన జంక్షన్లను పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యలు ఉన్న చోట్ల రోడ్డు విస్తరణ, పాదచారుల భద్రత కోసం పెలికాన్ సిగ్నల్స్, లేన్ మార్కింగ్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అవసరమైన సివిల్ పనులను త్వరగా పూర్తి చేసి వన్‌వే విధానాన్ని త్వరలో అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## భారత్-యూకే సీఈటీఏతో తెలంగాణ ఎగుమతులకు ఊతం..

### ఎగుమతి కంటైనర్ల ప్రారంభం

**హైదరాబాద్, జూలై 15**

భారత్–యూకే సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) అమలులోకి వచ్చిన సందర్భంగా హైదరాబాద్‌లో తెలంగాణ నుంచి యూకేకు వెళ్లే ఎగుమతి కంటైనర్లను పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య జెండా ఊపి ప్రారంభించారు. ఈ ఒప్పందంతో పన్ను రాయితీలు, మెరుగైన మార్కెట్ ప్రవేశం, సరళీకృత కస్టమ్స్ విధానాల ద్వారా తెలంగాణ ఎగుమతిదారులకు కొత్త అవకాశాలు లభిస్తాయని ఆయన తెలిపారు. 2025–26లో తెలంగాణ నుంచి యూకేకు 402.5 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయి. ఫార్మా, బయో లాజికల్స్, ఎలక్ట్రానిక్స్, రసాయనాలు, ఇంజనీరింగ్, వైద్య పరికరాలు, వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతులకు సీఈటీఏ మరింత ఊతమిస్తుందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌లో బియ్యం ఎగుమతి కంటైనర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రారంభించగా, హయత్‌నగర్‌లో ఆహార ఉత్పత్తుల ఎగుమతి కంటైనర్‌ను విదేశీ వాణిజ్య విభాగం అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో కస్టమ్స్, అపెడా, యూకే హైకమిషన్, విదేశీ వాణిజ్య విభాగం తదితర సంస్థల అధికారులు పాల్గొన్నారు.

## జిల్లా క్రీడా పోటీలు సెప్టెంబర్ తొలి వారంలో

**మెదక్, జూలై 15**



మెదక్ జిల్లాలో మండల స్థాయి క్రీడా పోటీలను ఆగస్టు 25లోపు పూర్తి చేసి, సెప్టెంబర్ తొలి వారంలో జిల్లా స్థాయి పోటీలను< నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా SGF వెబ్‌సైట్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. గత విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 192 మంది రాష్ట్రస్థాయికి, 16 మంది జాతీయస్థాయికి ఎంపికైనట్లు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఆర్. నాగరాజు తెలిపారు.

# చెత్తకుప్పల్లో కాదు.. 'ఊయల'లో ఉంచండి

### కలెక్టర్ సీ.హెచ్ ప్రియాంక

**నారాయణపేట,జులై,15**




అనివార్య పరిస్థితుల్లో నవజాత శిశువులను రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, చెత్తకుప్పలు వంటి ప్రాంతాల్లో వదిలివేయకుండా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ★'ఊయల' (Cradle Baby Centre)★లో సురక్షితంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నారాయణపేట ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఊయల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,,,వదిలివేయబడిన శిశువుల ప్రాణాలను కాపాడి వారికి భద్రమైన సంరక్షణ కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ఒకవైపు కొంతమంది నవజాత శిశువులను అనాథలుగా వదిలివేస్తుండగా, మరోవైపు సంతానం లేని దంపతులు Central Adoption Resource Authority (CARA) నిబంధనల ప్రకారం చట్టబద్ధ దత్తత కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఈ రెండు అంశాలను దృష్టిలో ఉంచుకుని శిశువును పెంచుకునే అవకాశం లేని తల్లిదండ్రులు ఎలాంటి భయం, సంకోచం లేకుండా 'ఊయల'లో వదిలి వెళ్లాలని సూచించారు. ఊయలలో ఉంచిన శిశువులను మహిళా, శిశు సంక్షేమ శాఖ పూర్తి బాధ్యతతో సంరక్షించి, అమల్లో ఉన్న చట్టాలు, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుని అర్హులైన దత్తత తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇచ్చే ప్రక్రియను నిర్వహిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా నవజాత శిశువుల ప్రాణాలను కాపాడడంతో పాటు వారికి మంచి భవిష్యత్తు కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ సూపర్ఇంటెండెంట్ సంపత్ కుమార్ సింగ్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఆదిత్య, డిఎంహెచ్వో జయచంద్ర మోహన్, డిసిపిఓ కరిష్మా, ప్రొఫెసర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు......జిల్లా పౌర సంబంధాల అధికారి నారాయణపేట చేజారి చేయబడింది.

# జర్నలిస్టుల సంక్షేమ నిధిపై వాస్తవాల వక్రీకరణ సరికాదు

### తెలంగాణ మీడియా అకాడమీ

**హైదరాబాద్, జూలై 15**

తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధిపై ప్రచురితమైన కథనాలు వాస్తవాలను ప్రతిబింబించడం లేదని తెలంగాణ మీడియా అకాడమీ స్పష్టం చేసింది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వెల్ఫేర్ ఫండ్ కమిటీ ప్రతి మూడు నెలలకు సమావేశమవుతూ దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తోందని, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు సంబంధించిన అర్హత గల ఒక్క దరఖాస్తు కూడా ప్రస్తుతం పెండింగ్‌లో లేదని తెలిపింది. తీవ్రమైన అనారోగ్యం లేదా శాశ్వత అంగవైకల్యానికి ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ.50 వేల నుంచి రూ.1 లక్షకు పెంచినట్లు వెల్లడించింది. విద్యా సహాయం, వైద్య సహాయం, మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక భరోసా నిరంతరాయంగా అందుతున్నాయని పేర్కొంది. డిజిటల్ జర్నలిజం, ఫ్యాక్ట్ చెకింగ్, కృత్రిమ మేధస్సు (AI), ఎన్నికల నిబంధనలు, మీడియా నైతిక విలువలపై చిన్న బ్యాచ్‌లతో నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గిరిజన, ఉర్దూ, మహిళా జర్నలిస్టులు, ఐఅండ్‌పీఆర్ అధికారులకు ప్రత్యేక శిక్షణలు కూడా నిర్వహించినట్లు తెలిపింది. పూర్తి సమాచారం తెలుసుకోకుండా ప్రచురించే అసంపూర్ణ కథనాలు అపోహలకు దారితీస్తాయని,

# తెలంగాణ ఉద్యమకారులకు మేనిఫెస్టో హామీలు వెంటనే అమలు చేయాలి

- **250 గజాల స్థలం, పెన్షన్, హెల్త్ కార్డు, ప్రత్యేక గుర్తింపు కార్డులు అందించాలి – ఆలేరు తెలంగాణ ఉద్యమకారుల సంఘం డిమాండ్**

**ఆలేరు, జూలై 15 :**



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆలేరు తెలంగాణ ఉద్యమకారుల సంఘం డిమాండ్ చేసింది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెలవారీ పెన్షన్, తెలంగాణ స్వాతంత్ర సమరయోధులుగా గుర్తింపు, హెల్త్ కార్డు, ప్రత్యేక గుర్తింపు కార్డులు అందజేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ఆ హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.తెలంగాణ ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ఇటీవల ప్రభుత్వం మంత్రివర్గ కమిటీని ఏర్పాటు చేసి, ఉద్యమంలో పాల్గొన్న వివిధ వర్గాల అభిప్రాయాలను సేకరిస్తున్న సందర్భంగా ఆలేరు ప్రాంత ఉద్యమకారుల తరఫున తమ డిమాండ్లను వినిపిస్తున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆలేరు ప్రాంతంలో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని గుర్తు చేశారు. సమాజంలోని అన్ని వర్గాలు, అన్ని జాతుల ప్రజలు ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారని, అనేక మంది ఉద్యమకారులు పోలీసు కేసులు ఎదుర్కొని జైలుకు వెళ్లారని పేర్కొన్నారు. లాఠీచార్జీలు, కాల్పులు, నిర్బంధాలు, కుటుంబాలకు దూరంగా ఉండి ఉద్యమంలో పాల్గొన్న త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరులను కూడా స్మరించారు.ఉద్యమకారుల కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ కమిటీ ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ప్రభుత్వంలో కీలక స్థానంలో ఉన్నందున ఆలేరు ప్రాంత ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం జరిగేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు ఆడకు బాలస్వామి, జిల్లా నాయకులు రచ్చ రామ్ నరసయ్య, జర్నలిస్టు విభాగం జిల్లా నాయకులు యేలుగల కుమారస్వామి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సీస మహేశ్వరి, మాజీ ఎంపీపీ కాసగళ్ల

# ఆలేరులో కుమ్మర్ల తొలి బోనం జాతర కరపత్రం ఆవిష్కరణ

- **హైదరాబాద్‌లో జరిగే జాతరను విజయవంతం చేయాలని సంఘం నాయకుల పిలుపు**

**ఆలేరు, జూలై 15 :**




తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో జూలై 16న హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్‌బండ్ సమీపంలోని శ్రీ శ్రీ శ్రీ కనకాల కట్ట మైసమ్మ దేవాలయంలో నిర్వహించనున్న ఆషాఢ మాసం కుమ్మర్ల తొలి బోనం జాతరకు సంబంధించిన కరపత్రాన్ని బుధవారం ఆలేర్ పట్టణ కేంద్రంలో ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ( టి ఆర్ కె ఎస్ ) రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర కమిటీ ఆదేశాలు, జిల్లా కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని ఆలేరు మండల అధ్యక్షులు గంగాధరి సుధీర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధరి సుధీర్ కుమార్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరగనున్న కుమ్మర్ల తొలి బోనం జాతరను ఘన విజయవంతం చేయడం ప్రతి కుమ్మరి కుటుంబ బాధ్యత అని అన్నారు. ఆలేరు మండలంతో పాటు పరిసర ప్రాంతాల కుమ్మరి సోదరులు, సోదరీమణులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో జాతరలో పాల్గొనాలని కోరారు. ఈ జాతర కుమ్మరి సమాజ ఐక్యతకు, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో పట్టణ కమిటీ అధ్యక్షులు కొరుటూరి ఉపేందర్, మండల ప్రధాన కార్యదర్శి జివిలికపల్లి సత్యనారాయణ, మండల ఉపాధ్యక్షులు శనిగరం హరీష్, మండల సలహాదారు గంగాధరి సత్తయ్య, సాయిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు గంగాధరి పరమేష్, కోరుటూరి ఇస్తారి, గంగాధరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం జాతర విజయవంతం కోసం విస్తృత ప్రచారం నిర్వహించాలని నాయకులు నిర్ణయించారు.

# అరుణోదయ నాగన్న సంతాప సభను విజయవంతం చేయాలి

### ఆలేర్‌లో పోస్టర్లు, కరపత్రాల ఆవిష్కరణ

**ఆలేరు, జూలై 15 :**



విప్లవ సాంస్కృతిక ఉద్యమ యోధుడు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య తెలంగాణ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అమరుడు కామ్రేడ్ అరుణోదయ నాగన్న సంతాప సభను జూలై 25న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు శికిలం కుమారస్వామి తెలిపారు. ఈ సభను ప్రజలు, ప్రజాస్వామికవాదులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు, విప్లవ కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ఆలేరు రైల్వే గేట్ సెంటర్‌లో సంతాప సభకు సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శికిలం కుమారస్వామి మాట్లాడుతూ కామ్రేడ్ నాగన్న గత ఐదు దశాబ్దాలుగా పీడిత ప్రజల విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత ప్రజా కళాకారుడని కొనియాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు, గౌరవాధ్యక్షుడిగా వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా తన గాత్రంతో, విప్లవ గీతాలతో ప్రజలను చైతన్యపరిచారని చెప్పారు. అనేక జానపద, సాంస్కృతిక కళారూపాల ద్వారా దోపిడీ, పీడన, అసమానతలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం నింపారని, నిరుపేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం తన కళను ఆయుధంగా మలిచిన అరుదైన విప్లవ కళాయోధుడిగా నాగన్న చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. ప్రజల కోసం చివరి శ్వాస వరకు గానం చేసిన అమర కళాకారుడికి నివాళిగా నిర్వహిస్తున్న సంతాప సభకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజాసంఘాలు, కళాకారులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచకొండ జనార్ధన్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్లెపు అడివయ్య, ప్రధాన కార్యదర్శి బేజాడి కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్. సీత, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పద్మ సుదర్శన్, ప్రధానv కార్యదర్శి గడ్డం నాగరాజు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్ధేశ్వర్, ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్, ప్రజా సంఘాల నాయకులు శికిలం వెంకటేష్, నమిలే స్వామి, వంగాల నర్సింహారెడ్డి, తలారి వెంకటేష్, మేకల వెంకటేష్, బుడిగె ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

చురకలు



# రైతులు నూతన సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలి

### జిల్లా కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక



**కోస్గి మండలం, జులై,15**

రైతులు నూతన సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు.నారాయణపేట జిల్లా కొస్గి మండలం మల్లారెడ్డిపల్లి రైతు వేదిక ముషీఫా లో జిల్లా కలెక్టర్ బుధవారం క్షేత్ర పర్యటన – పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన, "ప్రాజెక్ట్ కె–100"కు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా రైతులు ఆధునిక పద్ధతుల్లో సాగు చేస్తున్న మల్చింగ్ విధానంలో వంకాయ, పచ్చిమిర్చి సాగు, స్టేకింగ్ విధానంలో టమాట సాగు, అలాగే పూల సాగు (ఫ్లోరికల్చర్) పొలాలను ప్రత్యక్షంగా పరిశీలించారు.రైతులు అవలంబిస్తున్న ఆధునిక సాగు విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పంటల నిర్వహణ తీరు పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. వినూత్న వ్యవసాయ పద్ధతులను అనుసరిస్తూ అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగుతున్న రైతులను అభినందించి, ఇతర రైతులు కూడా ఇలాంటి ఆధునిక సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. అనంతరం ఎల్నినో పరిస్థితులలో ప్రత్యామ్నాయ పంటలు, కరువును తట్టుకునే రకాలు, స్వల్పకాలిక రకాలు సాగు చెయ్యాలని సూచించారు మరియు వర్షపు నీటిని ఆదా చేసుకోవడానికి ఫారం పాండ్స్ తవ్వుకోవాలని సూచించారు.అనంతరం నిర్వహించిన "ప్రాజెక్ట్ కె–100" ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నారాయణపేట సక్రియా నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలు, కూరగాయలు, పూల సాగు వంటి పంటల వైవిధ్యీకరణ (Crop Diversification) ద్వారా రైతులు అధిక ఆదాయం పొందవచ్చని వివరించారు.రైతుల ఆదాయాన్ని పెంచేందుకు, స్థిరమైన వ్యవసాయాభివృద్ధికి "ప్రాజెక్ట్ కె- 100" ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ, ఈ ప్రాజెక్టు విజయవంతమైన అమలుకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఎల్ నినో దృష్టిలో పెట్టుకుని వేయాల్సిన పంటలపై అవగాహన కల్పించాలన్నారు. పంటల సాగు పై రైతులకు అవసరమైన డాక్యుమెంటేషన్ చేయాలన్నారు. తాను కూడా రైతు కుటుంబం నుండే వచ్చానని గతంలో పండే పంటలు నేడు పండించలేకపోతున్నారని అన్నారు.అలాగే ఈ కార్యక్రమంలో కూరగాయల విత్తనాలు, పత్తి విత్తనాలు రైతులకు అందచేశారు.ఈ కార్యక్రమంలో వార్ల విజయ్ కుమార్ గ్రంథాలయ చైర్మన్ రఘువర్ధన్ రెడ్డి ఏ డీ ఏ రామ కృష్ణ , తహసీల్దార్ శ్రీనివాసులు , ఎంపిడిఓ శ్రీధర్ , హార్టికల్చర్ అధికారి హర్ష వర్ధన్ రెడ్డి , కొస్గి డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయ అధికారులు (ఎం ఏ ఓ లు) రేష్మ రెడ్డి , రమేష్ , ప్రవీణ్ కుమార్ , వ్యవసాయ విస్తరణ అధికారులు , ఉద్యాన శాఖ అధికారులు మరియు సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్స్, రైతు సోదరులు పాల్గొన్నారు.అలాగే కోస్గి, మద్దూర్, కొత్తపల్లి, గుండుమల్ మండలాలకు చెందిన సుమారు 120 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని పంటల వైవిధ్యీకరణ, ఆధునిక సాగు పద్ధతులు మరియు ప్రాజెక్ట్ K–100 ద్వారా లభించే ప్రయోజనాలపై అవగాహన పొందారు. జిల్లా పౌర సంబంధాల అధికారి నారాయణపేట చేజారి చేయబడింది.

# పార్కా.. జైలా? కమలా నగర్ పార్క్ ప్రహరీ గోడపై స్థానికుల ఆగ్రహం

**కాప్రా, జూలై 15**

కాప్రా సర్కిల్ పరిధిలోని కమలా నగర్ పార్క్ చుట్టూ ఎత్తైన ప్రహరీ గోడ నిర్మాణంపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, వృద్ధుల కోసం ఉద్దేశించిన పార్క్‌ను జైలును తలపించేలా మార్చారని మండిపడుతున్నారు. కమలా నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన గోడ ఎత్తు పెంపు పనుల కోసం లక్షల రూపాయల ప్రజాధనాన్ని ఖర్చు చేశారని, అయితే ఆట వస్తువులు, పచ్చదనం, తాగునీరు, బెంచీలు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. గోడ ఎత్తు పెరగడంతో పార్క్ లోపలి కార్యకలాపాలు బయట నుంచి కనిపించకుండా పోయాయని, దీంతో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పార్క్ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న ఘటనను గుర్తుచేస్తూ, ఇప్పుడు ప్రజాభిప్రాయం లేకుండానే గోడల నిర్మాణం చేపట్టడం మరో వివాదానికి దారితీసిందని పేర్కొన్నారు. ప్రజల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకున్నారని, పారదర్శకత లోపించిందని స్థానికులు విమర్శించారు. ఈ అంశంపై జోనల్ కమిషనర్ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పార్క్‌ను తిరిగి చిన్నారులు, ప్రజలకు అనుకూలంగా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు.

# ఆలేరు రైల్వే అండర్‌పాస్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ బాలమణి భాస్కర్

- **8 నుంచి 12వ వార్డుల ప్రజల దశాబ్దాల సమస్యకు శాశ్వత పరిష్కారం: ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతలు**

**ఆలేరు, జూలై 15 :**

ఆలేరు పట్టణంలోని రైల్వే గేట్ సమీపంలో ఇటీవల నిర్మించిన అండర్‌పాస్‌ను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యత, ప్రజలకు అందుతున్న సౌకర్యాలను ఆమె స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గతంలో మాజీ ఎమ్మెల్యే అప్పటి మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా రైల్వే గేట్ అవతల ఉన్న 8, 9, 10, 11, 12 వార్డుల ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. రైల్వే గేట్ మూసివేసిన ప్రతిసారి విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకోవడం, అత్యవసర వైద్యం కోసం వెళ్లే రోగులు, వృద్ధులు, ఉద్యోగులు, సాధారణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అండర్‌పాస్ నిర్మాణాన్ని పూర్తి చేయించి, దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని ఆమె కొనియాడారు. ఈ అండర్‌పాస్ వల్ల రాకపోకలు సులభతరమై, ప్రజల సమయం ఆదా కావడంతో పాటు అత్యవసర సేవలు కూడా వేగంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆలేరు పట్టణ ప్రజల తరఫున ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ఆమె ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనుల అమలులో



మున్సిపల్ పాలకవర్గం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు మరియమ్మ మార్కు, పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, మల్లెల సరిత శ్రీకాంత్, జట్ట నీరజా సిద్ధులు, కాంగ్రెస్ నాయకులు శికిలం శ్రీను, వెంకట్ రెడ్డి, తాళ్లపల్లి మహేష్, ఆలేరు పట్టణ అఖిలపక్ష నాయకుడు బండెల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# నిషికాంత్ దూబే లీగల్ నోటీసుకు కౌంటర్.. క్షమాపణతోనే హక్కులు రిజర్వ్

**న్యూఢిల్లీ, జూలై 15:**



బీజేపీ ఎంపీ డాక్టర్ నిషికాంత్ దూబే తరఫున న్యాయవాది రిషి కె. అవస్థీ, అడ్వకేట్ కృష్ణ కన్హయ్య పాల్ పంపిన లీగల్ నోటీసుకు సమాధానం పంపారు. నోటీసులో చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, చట్టపరంగా నిలవవని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతంగా అవమానించాలనే ఉద్దేశంతో కావని, నోటీసు అందుకునే వరకు సంబంధిత వ్యక్తి గురించి తనకు వ్యక్తిగత పరిచయం కూడా లేదని స్పష్టం చేశారు. అయితే తమ వ్యాఖ్యల వల్ల అనుకోకుండా ఎవరి మనోభావాలు దెబ్బతిన్నట్లయితే హృదయ పూర్వకంగా క్షమాపణలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్షమాపణను ఎట్టి పరిస్థితుల్లోనూ చట్టపరమైన తప్పు లేదా బాధ్యతను అంగీకరించినట్లు భావించరాదని, తమ అన్ని చట్టపరమైన హక్కులు యథాతథంగా కొనసాగుతాయని సమాధానంలో వెల్లడించారు.

# అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి, జూలై 15**

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR)లో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాలను ఆలస్యం చేయకుండా సంబంధిత బీఎల్‌వో, బీఎల్‌వో సూపర్‌వైజర్ లేదా సమీప హెల్ప్‌డెస్క్‌లో సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు. ఓటర్ల సౌకర్యార్థం సంగారెడ్డి జిల్లాలోని అన్ని శాసనసభ నియోజకవర్గాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హెల్ప్‌డెస్క్‌లలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పేర్లు, హోదాలు, సంప్రదింపు ఫోన్ నంబర్లను ప్రజల వినియోగం కోసం విడుదల చేసినట్లు చెప్పారు. ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి వివరాలతో నింపి నిర్ణీత గడువులోగా సమర్పించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. హెల్ప్‌డెస్క్‌ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఆన్‌లైన్‌లోనే ఇసుక బుకింగ్ – కలెక్టర్ దివాకర్ టీఎస్

**ఖమ్మం, జూలై 15 :**

జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుక బుకింగ్ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశించారు. ఇంజనీరింగ్ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో, ఇసుక వినియోగం, సరఫరాపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. జిల్లాలోని అన్ని స్యాండ్ బజార్లలో 1,000 క్యూబిక్ మీటర్ల ఇసుక నిల్వ ఉంచినట్లు తెలిపారు. ఇసుక రీచ్‌ల ఆదాయ వివరాలను వెంటనే సమర్పించి, నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీలకు పంపిణీ చేయాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో ఉన్న సమస్యలను వెంటనే నివేదించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

# నంబర్ ప్లేట్ నిబంధనలు ఉల్లంఘించిన 36 వాహనాలపై కేసులు



**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 15**

కొత్తగూడెం పట్టణంలో నంబర్ ప్లేట్లు లేని, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు చేపట్టిన ఈ డ్రైవ్‌లో మొత్తం 36 వాహనాలపై కేసులు నమోదు చేసి, రూ.7,510 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, వాహనాలకు నిబంధనలకు అనుగుణంగా స్పష్టంగా కనిపించే నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్లను వక్రీకరించడం, అంకెలను మార్చడం లేదా కనిపించకుండా చేయడం చట్టవిరుద్ధమని, ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

# ఈశ్వరమ్మకు తలసాని సంఘీభావం.. కాంగ్రెస్ నేతకు హెచ్చరిక

**హైదరాబాద్, జూలై 15:**

మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఎల్‌బీ నగర్ చింతలకుంటలో యాదగిరిగుట్ట దేవస్థానం సభ్యురాలు పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌ను పరామర్శించి సంఘీభావం తెలిపారు. ఇటీవల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి ఆమెపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, బడుగు బలహీన వర్గాల జోలికి వస్తే సహించబోమని హెచ్చరించారు. ఈశ్వరమ్మ ఒంటరిది కాదని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఆమెకు అండగా ఉంటారని తలసాని పేర్కొన్నారు. అగ్రకుల అహంకారంతో దుర్భాషలాడితే తగిన సమాధానం ఇస్తామని అన్నారు.

# రూ.20 వేల లంచం తీసుకుంటూ భూగర్భ జలశాఖ అధికారి ఏసీబీకి చిక్కాడు

**సూర్యాపేట, జూలై 15:**



సూర్యాపేట జిల్లా భూగర్భ జలశాఖ జిల్లా అధికారి మేఘావత్ బాలు, ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోసనోజు వెంకటేశ్వర్లు ఏసీబీకి చిక్కారు. బోర్‌వెల్ డ్రిల్లింగ్ రిగ్‌కు అనుమతి ఇవ్వడం, జరిమానాలు విధించకుండా ఉండేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా నల్గొండ రేంజ్ ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. లంచం మొత్తం డేటా ఎంట్రీ ఆపరేటర్ వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ నాంపల్లి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచగా, కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# భూ రీ-సర్వేలో పారదర్శకతకు ప్రాధాన్యం..

### విద్యార్థులకు ప్రాథమిక నైపుణ్యాలు తప్పనిసరి: కలెక్టర్



**పెద్దపల్లి, జూలై 15**

జిల్లాలో భూ రీ–సర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ప్రతి సర్వే నంబర్‌ను వరుస క్రమంలో ఖచ్చితంగా నమోదు చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా రీ–సర్వే పూర్తి చేయాలని సూచించారు. నిమ్మనపల్లి గ్రామంలో రీ–సర్వే పనులను పరిశీలించిన అనంతరం నిట్టూరు ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఎఫ్‌ఎల్‌ఎన్ కార్యక్రమం అమలును సమీక్షించారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు అందేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వెనుకబడిన విద్యార్థులకు అదనపు బోధన అందించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, పాఠశాల పరిశుభ్రత, మరుగుదొడ్లలో నీటి సౌకర్యం, ప్రీ–ప్రైమరీ విద్యార్థుల నమోదు పెంపుపై కూడా కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# వన మహోత్సవానికి 8.65 లక్షల మొక్కల లక్ష్యం

**రాజన్న సిరిసిల్ల, జూలై 15**

జిల్లాలో వర్షాలు కురిసిన తర్వాతే మొక్కల నాటకం చేపట్టాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. వన మహోత్సవం సందర్భంగా జిల్లాలో మొత్తం 8,65,200 మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని శాఖలు ముందుగానే గుంతలు తవ్వి మొక్కలను సిద్ధంగా ఉంచాలని, గతంలో నాటిన ఎండిపోయిన మొక్కలను అటవీశాఖ పరిశీలించాలని సూచించారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నర్సరీలు ఏర్పాటు చేసి, రహదారులు, ప్రభుత్వ స్థలాలు, ఆరోగ్య కేంద్రాలు, డంపింగ్ యార్డులు, అటవీ ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని ఆదేశించారు.

చురకలు



## ఉపాధ్యాయుల శిక్షణలో ఏఐ వినియోగంపై కలెక్టర్ పరిశీలన



**జగిత్యాల, జూలై 15**

జిల్లాలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న సబ్జెక్టుల వారీ వృత్యంతర శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. జ్ఞాన హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయుల శిక్షణను సందర్శించి, తరగతి గదిలో కృత్రిమ మేధ (AI), స్పోకెన్ ఇంగ్లీష్, విద్యార్థి-కేంద్రిత బోధన, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై అందిస్తున్న శిక్షణను పరిశీలించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదిలో సమర్థంగా అమలు చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ స్నేహ శబరిష్



**మహబూబాబాద్, జూలై 15**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, ప్రస్తుతం డిజిటలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి 2002 ఓటరు జాబితా ఆధారంగా వివరాలు సేకరించాలని, అందుబాటులో లేని వివరాలను గుర్తించి వేగంగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. డిజిటలైజేషన్ పనులను పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులను నియమించి క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ విజయవంతానికి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ విజయ, ఎంపీడీవో వీరబాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ పనితీరును పరిశీలించిన వరంగల్ సీపీ



**వరంగల్, జూలై 15 :**

వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ బుధవారం పోలీస్ కమిషనరేట్‌లోని పోలీస్ కంట్రోల్ రూం, కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించారు. అత్యవసర కాల్స్ స్వీకరణ, సీసీటీవీ పర్యవేక్షణ, నగర నిఘా, సాంకేతిక వ్యవస్థల పనితీరును సమీక్షించి, ప్రజలకు అత్యవసర సేవలు వేగంగా అందేలా సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను సమర్థంగా వినియోగించి నేరాల నియంత్రణ, ట్రాఫిక్ పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణలో మరింత సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు ప్రభాకర్ రావు, శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు

- **ఈసి కీలక నిర్ణయం!**
- **ఆగస్టు 3 వరకు ఇంటింటి సర్వే..**
- **అక్టోబర్ 12న తుది ఓటర్ల జాబితా విడుదల**

**హైదరాబాద్, జులై 15 :**

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ మేరకు సవరించిన నూతన షెడ్యూల్‌ను బుధవారం ఈసి అధికారికంగా విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన ఎన్నికల సంఘం, ఓటర్ల నమోదు మరియు సవరణల ప్రక్రియను మరింత సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

**తాజా ఉత్తర్వుల ప్రకారం..**

బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. నూతన షెడ్యూల్ వివరాలను తక్షణమే క్షేత్రస్థాయి అధికారులతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

**సవరించిన 'సర్' నూతన షెడ్యూల్ వివరాలు..**

రాష్ట్రంలో ఓటర్ల సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన పూర్తి కాలపట్టిక ఈ క్రింది విధంగా ఉంది. ప్రక్రియ కార్యక్రమంసవరించిన గడువు తేదీ బిఎల్‌ఓల ఇంటింటి సర్వే ముగింపుఆగస్టు 3, 2026 డ్రాఫ్ట్ (ప్రాథమిక) ఓటరు జాబితా విడుదల ఆగస్టు 10 క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణసెప్టెంబర్ 9 వరకుఅభ్యంతరాల పరిష్కారం (గడువు)అక్టోబర్ 8, 2026 వరకుతుది ఓటరు జాబితా ప్రచురణ (ఫైనల్ లిస్ట్)అక్టోబర్ 12.

# మెట్రో' ప్రయాణీకులకు మరింత మెరుగైన సేవలు

- **హైదరాబాద్ మెట్రో రైల్ అభివృద్ధిపై హెచ్ఎంఆర్ఎల్ అదనపు ఎండీ శ్రీ అజిత్ రెడ్డి సమీక్ష**



**హైదరాబాద్, జులై 15**

ప్రజలకు మరింత మెరుగైన సేవల ద్వారా హైదరాబాద్ మెట్రో ను మరింత అభివృద్ధి చేయడానికి సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేయాలని హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్ రెడ్డి అధికారులకు సూచించారు. ప్రస్తుత మెట్రో కారిడార్ల నిర్వహణ, అభివృద్ధిపై ఆయన బుధవారం మెట్రో లోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో ఉన్న 69 కిలోమీటర్ల మెట్రో కారిడార్లలో ప్రయాణీకుల సౌకర్యాలు, చివరి మైలు అనుసంధానం, భద్రత చర్యలు, పార్కింగ్, మెట్రో స్టేషన్ల శుభ్రత, ప్రయాణీకుల రద్దీకి తగ్గట్టుగా తీసుకోవాల్సిన చర్యలు, మొదలైన అంశాల గురించి అదనపు ఎండీ అజిత్ రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశంలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ కూడా పాల్గొన్నారు. అదనపు బోగీలను ఏర్పాటు చేసే విషయంలో సంబంధిత తయారీదారులతో చర్చించి త్వరితగతిన వాటిని సమకూర్చుకునే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రయాణీకుల సురక్షితమైన, సులభమైన ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. మెట్రో లో రాకపోకలు సాగించే వారు గమ్యాలకు చేరుకోడానికి ఉన్న రవాణా అవకాశాలను చర్చించారు. వారి గమ్యస్థానాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేరుకునేలా అందుకు ప్రత్యేక రవాణా సదుపాయాలను సమకూర్చేలా వివిధ ప్రజా రవాణా సంస్థలతో చర్చలు జరపాలని అన్నారు. ఇప్పటికే చివరి మైలు కనెక్టివిటీ కి ఉన్న వాహన సదుపాయాల సేవలను మరింత విస్తరించాలని ఆయన తెలిపారు. ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులతో కూడా సమన్వయం చేసుకుని తగు మార్గాలను అన్వేషించాలని అదనపు ఎండీ అజిత్ రెడ్డి తెలిపారు. మెట్రో స్టేషన్లతో అనుసంధానమై ఉన్న స్కై వాక్ ల నిర్వహణ, ఇంకా వాటి విస్తరణపై కూడా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్ల కు అనుసంధానమై ఉన్న స్కై వాక్ లు, సంబంధిత ఇతర మార్గాల నిర్వహణ గురించి కూడా రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. మెట్రో రైల్ స్టేషన్ కి వచ్చే ప్రయాణీకులు ఎటువంటి గందరగోళం లేకుండా టికెట్ తీసుకుని ప్రశాంతంగా మెట్రో లో ప్రయాణించేలా మార్గాలను మరింత మెరుగు పరచాలని అజిత్ రెడ్డి ఆదేశించారు. ప్రతి మెట్రో స్టేషన్ కి స్థానిక ప్రణాళిక ఉండాలని సూచించారు. ప్రయోగాత్మకంగా కొన్ని స్టేషన్లను ఎంపిక చేసుకుని, ఈ ప్రణాళిక ను అమలు చేసి, క్రమేణా మిగిలిన స్టేషన్లకు విస్తరించాలని ఆయన తెలిపారు. మెట్రో స్టేషన్ల నిర్వహణ, పని తీరుపై క్షేత్ర స్థాయిలో సమీక్షించడానికి త్వరలో తాను పర్యటనలు చేపడతానని ఆయన వెల్లడించారు. అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలలో ముఖ్యంగా హైటెక్ సిటీ, రాయదుర్గ్, గచ్చిబౌలి, ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్, కొండాపూర్ ద్వారా ఏర్పాటు చేసే పీఆర్‌టీఎస్ రవాణా వ్యవస్థ ప్రతిపాదనల ప్రగతిని సమీక్షించారు. స్టేషన్లలో భద్రతా చర్యలు, ప్రయాణీకుల సురక్షిత ప్రయాణానికి మెట్రో రైల్ భద్రతా విభాగం తీసుకుంటున్న చర్యలపై కూడా ఆయన చర్చించారు. ఈ సమీక్షా సమావేశంలో చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ డీవీఎస్ రాజు, చీఫ్ సిగ్నలింగ్ అండ్ టెక్నికల్ ఇంజినీర్ స్వపన్ కుమార్ దాస్, చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి.ఆనంద్ మోహన్, జనరల్ మేనేజర్ ఎం.విష్ణువర్ధన్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ వై.సాయపరెడ్డి, జనరల్ మేనేజర్ (సెక్యూరిటీ) శ్రీనాథ్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## భూ రీ-సర్వేలో తప్పులకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**

**గన్‌పూర్, జూలై 15 :**

భూ రీ-సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, ఖచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం గన్‌పూర్ మండలం గన్‌పూర్ శివారులో జరుగుతున్న భూ రీ-సర్వేను పరిశీలించిన కలెక్టర్, రోవర్ పరికరం ద్వారా అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా సరిహద్దులను పకడ్బందీగా గుర్తించి నమోదు చేయాలని సూచించారు. భూ రీ-సర్వేతో సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు రైతుల భూ హక్కులు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. ప్రతి రైతు భూమి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, రైతులు ముఖ్యంగా సరిహద్దు భూముల యజమానులు సర్వేకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## వైద్య కళాశాల నిర్మాణ పనులు నెలాఖరులోపు పూర్తి చేయాలి

**కలెక్టర్ రాహుల్ శర్మ**

**గన్‌పూర్, జూలై 15 :**



జిల్లాలో నిర్మాణంలో ఉన్న వైద్య కళాశాల భవన పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తిచేసి పూర్తిస్థాయిలో అప్పగించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, అంతర్గత రహదారులు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతులను కూడా సకాలంలో సిద్ధం చేయాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వైద్య కళాశాల హాస్టల్ నిర్మాణాన్ని సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# సర్ కింద గణన ఫారమ్‌లను సకాలంలో సమర్పించాలని బల్దియా కమిషనర్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 15**

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా మరియు అదనపు కమిషనర్ (ఎన్నికలు) బి. సంతోష్ సంయుక్తంగా విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా గణన ఫారమ్‌ల పంపిణీ దాదాపు 100% పూర్తయిందని, అందిన ఫారమ్‌లలో సుమారు 26% ఇప్పటికే డిజిటలైజ్ చేయబడ్డాయని కమిషనర్ తెలిపారు. అలాగే, మొత్తం ఓటర్లలో దాదాపు 24% మంది 'గైర్హాజరైన, నివాసం మారిన మరియు మరణించిన' (ASD) ఓటర్ల వర్గానికి చెందినవారని ఆయన పేర్కొన్నారు.ఫారమ్‌ల సమర్పణకు ఆగస్టు 3 చివరి తేదీ అని గుర్తు చేస్తూ, చివరి రోజు వరకు వేచి ఉండకుండా అర్హులైన ఓటర్లందరూ తాము నింపిన గణన ఫారమ్‌లను ఆలస్యం లేకుండా సమర్పించాలని కమిషనర్ కోరారు. ఇందుకోసం జీహెచ్ఎంసి విస్తృత అవగాహన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇందులో బి ఎల్ ఓ ల ద్వారా ఇంటింటికీ సందర్శనలు, ఆటో-రిక్షాల ద్వారా ప్రజా ప్రకటనలు, వార్తాపత్రికలు-టెలివిజన్-సోషల్ మీడి యాలో ప్రచారాలు, ప్రముఖ ప్రదేశాలలో బ్యానర్లు-పోస్టర్లు-హోర్డింగ్‌ల ఏర్పాటు, రాజకీయ పార్టీలు మరియు బూత్ స్థాయి ఏజెంట్లతో



సమావేశాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లతో చర్చలు మరియు ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఎప్పటికప్పుడు ఎస్ ఎం ఎస్ సందేశాలు పంపడం వంటివి ఉన్నాయి. గణన ఫారమ్ ఇంకా అందని ఓటర్లు ఎవరైనా ఉంటే, వారు వెంటనే సంబంధిత బి ఎల్ ఓ లేదా సూపర్‌వైజర్‌ను సంప్రదించాలని, లేదా టోల్-ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1950కి కాల్ చేసి ఫారమ్‌ను పొంది గడువు తేదీలోపు సమర్పించాలని కమిషనర్ సూచించారు.

## రూ.26 కోట్లతో ఆధునికీకరించిన హైటెక్ సిటీ రైల్వే స్టేషన్

**జూలై 17న ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు**

**హైదరాబాద్, జూలై 15 :**

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26 కోట్లతో ఆధునికీకరించిన హైదరాబాద్ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. హైటెక్ సిటీ స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, కొత్త లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఆధునిక ప్రయాణికుల సూచికలు, ఆకర్షణీయమైన స్టేషన్ ముఖద్వారం, కొత్త పోర్టికో వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. తెలంగాణలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు, ఇప్పటికే బేగంపేట, వరంగల్, కరీంనగర్ స్టేషన్లు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఆధునికీకరించిన హైటెక్ సిటీ స్టేషన్ హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలను అందించనుందని పేర్కొన్నారు.



# ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, జూలై 15 :**

వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల విలువలు, రిజిష్టర్లు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వారితో స్నేహపూర్వకంగా మెదలాలని తెలిపారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న గర్భిణుల వివరాలు పరిశీలించి గర్భిణులు తప్పనిసరిగా ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ల్యాబ్ ను సందర్శించి ప్రతిరోజు ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలు తెలుసుకున్నారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించడంతో పాటు అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలని తెలిపారు. బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్ తో కలిసి బెల్లంపల్లి మండల కేంద్రంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యారంగ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్ కృష్ణ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. జూలై 24వ తేదీ లోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్పష్టంగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. భూ భారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కార పురోగతిని సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అదనపు గదులు, భోజనశాల, మూత్రశాలల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సరుకుల నాణ్యతను పరిశీలించి ఆహారం తయారీ సమయంలో శుభ్రత నిబంధనలు, నాణ్యత ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీతమ్మసాగర్ అనుమతులకు కేంద్రంతో సంప్రదింపులు కొనసాగుతాయి: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూలై 15**

సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు త్వరగా వచ్చేలా కేంద్రంతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో సమావేశమైన ఆయన సీతారామ ప్రాజెక్టు పెండింగ్ అంశాలు, దోమలవాగు నిల్వ సామర్థ్య పెంపు, యాతలకుంట, జూలూరుపాడు సొరంగం పనులు, భూసేకరణ పరిహారం, పైప్ ఇరిగేషన్ తదితర అంశాలపై చర్చించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతులకు సాగునీరు త్వరగా అందేలా అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఇరువురు మంత్రులు తెలిపారు.

# కొలనుపాకలో 5 ఎకరాల 35 గుంటల సీలింగ్ భూమి ప్రభుత్వ స్వాధీనం

- **అక్రమ కొనుగోలు: అమ్మకాలపై రెవెన్యూ శాఖ చర్య..**
- **గ్రామస్తుల సమక్షంలో పంచనామా**

**ఆలేరు, జూలై 15 :**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నంబర్ 425లో ఉన్న 5 ఎకరాల 35 గుంటల సీలింగ్ భూమిని రెవెన్యూ అధికారులు బుధవారం ప్రభుత్వ స్వాధీనం చేసుకున్నారు. రెవెన్యూ శాఖ సమాచారం మేరకు, ఈ భూమి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు, అమ్మకాలు జరిగినట్లు గుర్తించడంతో తహశీల్దార్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో గ్రామ పెద్దలు, పంచుల సమక్షంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్ రావు ఆధ్వర్యంలో భూమికి సంబంధించిన పంచనామా నిర్వహించి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. అధికారులు భూమి హద్దులను గుర్తించి ప్రభుత్వ స్వాధీనానికి సంబంధించిన ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ భూములు, సీలింగ్ భూములు లేదా నిషేధిత జాబితాలో ఉన్న భూముల కొనుగోలు, అమ్మకాలు చట్టవిరుద్ధమని తెలిపారు. ఇలాంటి లావాదేవీలకు పాల్పడే వారిపై



చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు రెవెన్యూ శాఖ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రోజన్, గ్రామ పాలనాధికారి నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ విజయేందర్ రెడ్డి, గ్రామస్తులు బెదరబోయిన వెంకటేశ్వర్లు, చీరబోయిన రమేష్, గాదె సోమిరెడ్డి, వానరాశి నరసయ్య, సంపత్, మహేష్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# పాములన్నీ విషపూరితం కావు

- **మీర్జాపూర్ లో విద్యార్థులకు అవగాహన**
- **యంగ్ ఎర్త్ లీడర్స్ సమన్వయకర్త వార్ల మల్లేశం**

**కోస్గి మండలం, జులై,15**



భూమిపై అగుపించే అన్ని పాములు విషపూరితము కావని కనిపించిన ప్రతిపామును చంపేయడం సరికాదని యంగ్ ఎర్త్ లీడర్స్ సమన్వయకర్త వార్ల మల్లేశం అన్నారు. ప్రపంచం పాముల సంరక్షణ దినోత్సవం సందర్భంగా బుధవారం నారాయణపేట జిల్లా కోస్గి మండలం మీర్జాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణం లో పాముల పాత్ర... అనే కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని విష సహిత విషరహిత పాముల గుర్తింపు, వాటి స్వభావాలు అనే అంశంపై ఎర్త్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకృతి సమతుల్యత కాపాడడంలో పాములు కీలక పాత్ర పోషిస్తాయని అహారపు గొలుసులలో పాముల స్థానం ఎంతో ముఖ్యమైనదని వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భూమిపై గల సహజ ఆవరణ వ్యవస్థలను కాపాడటములో పంటలకాశించే చీడపురుగులును భక్షించడములో పైర్లకు నష్టం కలిగించే ఎలుకల సంఖ్యను తగ్గించడంలో పాములు తొడపడ్తాయని అన్నారు.జెర్రిపోతు వంటి విషరహిత సర్పాలు నాగుపాము వంటి విషపూరిత పాముల పిల్లలను తినడం ద్వారా వాటి సంఖ్యను తగ్గిస్తాయని గుర్తు చేశారు. అన్ని పాములు ప్రమాదకరం కావనే విషయం గుర్తుపెట్టుకోవాలని అన్నారు.పాముల రకాల గుర్తింపు, వాటి విష ప్రభావం, తీసుకువాల్సిన జాగ్రత్తలు, చికిత్సలను డిజిటల్ వీడియో ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ రాష్ట్రంలోని పాముల రకాలు వాటి స్వభావాలు పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సీతాఫల్‌మండి–లాలాగూడ కొత్త కార్డ్ లైన్‌ను పరిశీలించిన ఎస్‌సీఆర్ జీఎం

**హైదరాబాద్, జూలై 15**



దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సీతాఫల్‌మండి–లాలాగూడ మధ్య నూతనంగా ప్రారంభమైన 3 కి.మీ. కార్డ్ లైన్‌ను బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని ప్రయాణికుల సౌకర్యాలు, సిగ్నలింగ్, భద్రతా వ్యవస్థలు, ప్లాట్‌ఫారాలు, టికెట్ కౌంటర్లు, వెయిటింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం కొత్త లైన్‌పై ట్రాలీ తనిఖీ నిర్వహించి పాయింట్లు, క్రాసింగ్‌లను పరిశీలించారు. ఈ కొత్త కార్డ్ లైన్‌తో సికింద్రాబాద్‌ను బైపాస్ చేస్తూ కాజీపేట–కాచిగూడ రైళ్ల దూరం సుమారు 12 కి.మీ., ప్రయాణ సమయం 20 నిమిషాలు తగ్గనుంది. ప్రాజెక్టులో 5 చిన్న వంతెనలు, పూర్తి ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అనంతరం లాలాగూడ స్టేషన్‌ను కూడా జీఎం తనిఖీ చేసి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

# రోడ్డు భద్రతకు ప్రత్యేక ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ & రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటుకు చర్యలు

**హైదరాబాద్, జూలై 15:**

తెలంగాణలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, రోడ్డు భద్రత బలోపేతం కోసం ప్రత్యేక "ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ & రోడ్ సేఫ్టీ బ్యూరో" ఏర్పాటు దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ అంశంపై డీజీపీ సి.వి. ఆనంద్ పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, సంస్థ నిర్మాణం, విధులు, సిబ్బంది, చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలపై చర్చించారు. ఇతర రాష్ట్రాల ఉత్తమ విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర నిబంధనలను పరిశీలిస్తూ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపు, సంబంధిత శాఖలతో సమన్వయం బలోపేతంపై కూడా దృష్టి సారించారు. మరో సమీక్ష సమావేశం త్వరలో నిర్వహించనున్నట్లు డీజీపీ తెలిపారు.

# రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం: మంత్రి గొట్టిపాటి రవికుమార్

అమరావతి, జూలై 15 : రాష్ట్రంలో రోజుకు సుమారు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవుతున్నప్పటికీ, అంతరాయం లేకుండా సరఫరా చేస్తున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. వరుసగా రెండో ఏడాది ట్రూ–డౌన్ అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌దేనని, గత రెండేళ్లుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామని చెప్పారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను సీఎం చంద్రబాబు నాయుడు గాడిలో పెట్టారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ బలోపేతం, కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల నిర్మాణంతో పాటు రూ.6,000 కోట్ల విద్యుత్ ప్రాజెక్టులు వివిధ దశల్లో అమలవుతున్నాయని మంత్రి వెల్లడించారు.

# రూ.26 కోట్లతో ఆధునికీకరించిన హైటెక్ సిటీ రైల్వే స్టేషన్

### జూలై 17న ప్రధాని మోదీ వర్చువల్ గా ప్రారంభించనున్నారు




**హైదరాబాద్, జూలై 15 :**

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రూ.26 కోట్లతో ఆధునికీకరించిన హైదరాబాద్ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను ఈ నెల 17న ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే అధికారులు స్టేషన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. హైటెక్ సిటీ స్టేషన్‌లో 12 మీటర్ల వెడల్పు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్, కొత్త లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఆధునిక ప్రయాణికుల సూచికలు, ఆకర్షణీయమైన స్టేషన్ ముఖద్వారం, కొత్త పోర్టికో వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. తెలంగాణలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు, ఇప్పటికే బేగంపేట, వరంగల్, కరీంనగర్ స్టేషన్లు ప్రారంభమైనట్లు అధికారులు తెలిపారు. ఆధునికీకరించిన హైటెక్ సిటీ స్టేషన్ హైదరాబాద్ ఐటీ కారిడార్‌కు మరింత మెరుగైన రవాణా సౌకర్యాలను అందించనుందని పేర్కొన్నారు.

# ఐఐఐటీ విద్యార్థినికి రూ.5 వేల ఆర్థిక సాయం



**కామారెడ్డి, జూలై 15:**

బీబీపేట్ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నక్షత్ర బాసర ఐఐఐటీలో ఎంపికైంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటంతో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్‌ను కలిసి ఆర్థిక సహాయం కోరింది. స్పందించిన కలెక్టర్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా రూ.5 వేల ఆర్థిక సాయాన్ని నక్షత్రకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎం. రాజన్న, అంకన్నగారి నాగరాజ్ గౌడ్ పాల్గొన్నారు.

# ఐదు కొత్త కోర్సులకు యూజీసీ ఆమోదం..

### అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలు త్వరలో

**హైదరాబాద్, జూలై 15**



: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ (BRAOU)లో ఐదు కొత్త కోర్సులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆమోదం లభించినట్లు వైస్–ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి తెలిపారు. కొత్తగా ఎం.ఏ. ఎడ్యుకేషన్, ఎం.ఏ. ఎడ్యుకేషన్ (స్కూల్ అడ్మినిస్ట్రేషన్), మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ), ఎంఎస్సీ జియోగ్రఫీ కోర్సులతో పాటు బి.ఎడ్. (స్పెషల్ ఎడ్యుకేషన్) కోర్సుకు అనుమతి పునరుద్ధరించినట్లు వెల్లడించారు. జూన్‌లో యూజీసీ నిపుణుల కమిటీ వర్చువల్ తనిఖీ నిర్వహించి, మౌలిక వసతులు, అధ్యాపక సిబ్బంది, ఇతర ప్రమాణాలను పరిశీలించిన అనంతరం ఈ కోర్సులకు ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి డా. యోగిత రాణా సహకారంతో ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాభివృద్ధికి అనుగుణంగా కోర్సులను రూపొందించినట్లు తెలిపారు.

ఉపాధ్యాయులకు అర్హతలు, నాయకత్వ నైపుణ్యాలు, పాఠశాల పరిపాలనలో శిక్షణ అందించేందుకు ఈ కోర్సులు ఉపయోగపడతాయని, త్వరలో తెలంగాణ విద్యాశాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు చెప్పారు. కొత్త కోర్సులకు సంబంధించిన అర్హతలు, ఫీజులు, ప్రవేశ విధానం తదితర వివరాలతో త్వరలో అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది.



# ఒత్తిడిని జయించండిలా..!

వ్యక్తిగత జీవితం, ఉద్యోగ జీవితం సమన్వయం చేసుకునే క్రమంలో చాలా మంది ఒత్తిడికి గురవుతుంటారు. స్ట్రెస్, డిప్రెషన్ అనేవి అనేక ఇతర వ్యాధులకు కూడా కారణం అవుతున్నాయి. తాత్కాలికమైన ఒత్తిడి వల్ల కొన్ని లాభాలున్నప్పటికీ.. దీర్ఘకాలిక ఒత్తిడి వల్ల అనేక ఇబ్బందులు ఎదురవుతాయని చెప్తున్నారు. అసలు ఈ ఒత్తిడిని ఎలా జయించాలి? మానసిక నిపుణులు ఏం చెబుతున్నారు? ఈ కథనంలో తెలుసుకుందాం.



### ధ్యానంతో రిలాక్స్

రోజుకు కొన్ని నిమిషాలపాటు ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. ప్రశాంతమైన మ్యూజిక్ వినడంతో మనసు ప్రశాంతంగా ఉంటుంది. పచ్చదనం ఉన్న ప్రాంతంలో వాకింగ్ చేయడం ద్వారా ఒత్తిడిని జయించొచ్చు. నిరంతర వ్యాయామం చేయడం ద్వారా ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చు. వ్యాయామం చేసే సమయంలో ఎండార్ఫిన్ విడుదలవుతుంది. దీన్నిద్వారా ఒత్తిడి నుంచి బయటపడొచ్చు.

### ముందుగా ఒత్తిడిని గుర్తించండి

ఒత్తిడిని జయించాలంటే ఒత్తిడి ఎందుకు వచ్చిందో తెలుసుకోవడం మొదటి అడుగు. ముందు ఒత్తిడి కలిగించే వ్యక్తులు, పరిస్థితులను అధ్యయనం చేయాలి. అటువంటి పరిస్థితులు ఎదురు కాకుండా చూసుకోవాలి. మీకు ఒత్తిడి కలిగించే వ్యక్తులకు దూరంగా ఉండాలి.

### ఆరోగ్యకరమైన ఆహారం కూడా..

ఒత్తిడిని జయించాలంటే పండ్లు, కూరగాయలు, మాంసాహారాలు, తృణ ధాన్యాలు తీసుకోవాలి. అధిక కాఫీ, మద్యపానాలు, చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు సైతం ఒత్తిడిని పెంచుతాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండటం బెటర్. ఇక ఇష్టమైన వ్యక్తులతో మాట్లాడటం.. పుస్తకాలు చదవడం ద్వారా కూడా ఒత్తిడిని జయించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.









# లెమన్ ఆయిల్‌తో ఒత్తుగా జుట్టు

జుట్టుగా ఒత్తుగా ఉండాలన్నది అందరి కల. కానీ ప్రస్తుత జీవనశైలి, పని ఒత్తిడి తదితర కారణాలతో జుట్టు రాలుతూనే ఉంది తప్ప.. ఒత్తుగా ఉండటం లేదు. చాలా చిన్నవయసులోనే బట్ట తల కూడా వచ్చేస్తోంది. ఇక స్త్రీలకు పొడవైన జుట్టు.. అందమైన కురులు చక్కటి అందాన్ని ఇస్తాయి. కానీ ఇప్పుడు పొడగాటి, ఒత్తైన జుట్టు ఎక్కడా కనిపించడం లేదు. ఇక జుట్టును ఒత్తుగా ఉంచుకోవడానికి రకరకాల ఆయిల్స్, క్రీములు, షాంపూలు మార్చేస్తుంటారు. కానీ ఎన్ని ట్రై చేసినా జుట్టు మాత్రం పెరగడం లేదన్నదని యువత భావన. అయితే ఇప్పుడు బ్యుటీషియన్స్ లెమన్ ఆయిల్ తో జుట్టును ఒత్తుగా పెంచుకోవచ్చని ఓ సరికొత్త సలహా ఇస్తున్నారు. అసలు ఈ లెమన్ అయిల్ ఎలా వాడాలో ఈ కథనంలో తెలుసుకుందాం.. లెమన్ ఆయిల్ తో మీ తల మీద ఉన్న చుండ్రు, ఇతర వ్యర్థాలను తొలగించుకోవచ్చు. ఇక డ్యాండ్రఫ్, పొడి జుట్టును తగ్గించడంతోనూ ఈ ఆయిల్ సహాయపడుతుంది. లెమన్ ఆయిల్ తలలో రక్త రక్తప్రవాహాన్ని పెంచుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. తద్వారా జుట్టు మూలాలకు అవసరమైన పోషకాలు, ఆక్సిజన్ అందుతుందట. లెమన్ ఆయిల్ లో విటమిన్ సీ, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. వీటితో జుట్టు శక్తి మరింత ఇనుమడిస్తుంది.

### మసాజ్ ఎలా చేసుకోవాలి?

లెమన్ ఆయిల్‌ను కొద్దిగా నెయ్యిలో కలపుకోవాలి. ఈ మిశ్రమాన్ని తల మీద 5 నుంచి 10 నిమిషాల పాటు మసాజ్ చేయాలి. 30 నిమిషాల అలాగే వదిలేసి రసాయనాలు లేని షాంపూతో తల స్నానం చేయాలి. ఇలా నిత్యం వాడటం వల్ల జత్తు నిగనిగలాడుతుందని నిపుణులు చెబుతున్నారు. లెమన్ ఆయిల్ ను నేరుగా అప్లై చేయొద్దని.. మిశ్రమంగానే వాడాలని నిపుణులు సూచిస్తున్నారు.



# వర్షా కాలంలో ఈ కూరగాయలు బెస్ట్



వర్షా కాలంలో కొన్ని కూరగాయలు ఆరోగ్యానికి మేలు చేస్తాయని నిపుణులు సూచిస్తున్నారు. సహజంగా వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు తరుముకొస్తుంటాయి. చిన్నపిల్లలు ఎంతో జాగ్రత్తగా ఉండాల్సి ఉంటుంది. అయితే వర్షా కాలంలో కొన్ని రకాల కూరగాయాలు తీసుకోవడం వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. ఈ కూరగాయలు పుష్కలంగా పోషకాలను అందిస్తుంటాయి. జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. ఈ కూరగాయలు మీరు ఆహారంలో చేర్చుకుంటే వర్షా కాలంలో ఆరోగ్యంగా ఉండడంలో సహాయపడతాయి.



**కాకరకాయ:** రోగనిరోధక శక్తిని పెంచడంలో, కాలేయాన్ని శుభ్రపరచడంలో, రక్తాన్ని శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**ఆనపకాయ:** ఈ కూరగాయలో ఉన్న నీటి శాతం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది మరియు ఇది తేలికగా జీర్ణమవుతుంది.

**పొట్లకాయ:** ఇది మంచి డైటరీ ఫైబర్ అందిస్తుంది, ఆరోగ్యకరమైన జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది మరియు మలబద్ధకాన్ని నివారించడంలో సహాయపడుతుంది.

**బచ్చలికూర:** అధిక ఐరన్ కంటెంట్ రక్తహీనతను నివారించడంలో సహాయపడుతుంది. దీనిలోని యాంటీఆక్సిడెంట్లు రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి.

**మెంతి ఆకులు:** ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ మైక్రోబయల్ లక్షణాలను కలిగి ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మరియు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడుతుంది.

**మునగకాయలు:** రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి మరియు శ్వాసకోశ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**క్యారెట్లు:** బీటా కెరోటిన్, విటమిన్ ఏ మరియు యాంటీ ఆక్సిడెంట్లతో నిండి ఉంటుంది, ఇవి దృష్టిని మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని ఉంచడం వంటి ప్రయోజనాలు అందిస్తాయి.

**బీట్రూట్:** అధిక ఐరన్ కంటెంట్‌తో రక్తహీనతను నివారించడంలో, మరియు శక్తి స్థాయిలను నిర్వహించడంలో సహాయపడుతుంది.

**గుమ్మడికాయ:** విటమిన్ ఏ, సీ, ఈ, ఫైబర్ పుష్కలంగా ఉంటుంది, ఇది రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది మరియు జీర్ణక్రియకు సహాయపడుతుంది.

**బెండకాయ:** విటమిన్లు ఏ, సీ, ఫోలేట్, మరియు ఫైబర్ ఉన్నంత మాత్రాన ఇది మంచి జీర్ణక్రియను ఉంచుతుంది మరియు మలబద్ధకాన్ని నివారిస్తుంది.

ఈ కూరగాయలు మీ వర్షాకాల ఆహారంలో చేర్చుకుంటే, అవి మీ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి మరియు ఈ సీజన్‌లో ప్రత్యేకమైన రోగనిరోధక ప్రయోజనాలను అందిస్తాయి.

# ఫ్రాన్స్‌ను మట్టికరిపించిన స్పెయిన్



**టెక్సాస్, జూలై 15 (చురకలు):** ఫిఫా ప్రపంచకప్-2026లో స్పెయిన్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌ను 2-0 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో స్పెయిన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత మరోసారి ఫైనల్‌లో అడుగుపెట్టడం స్పెయిన్‌కు ఇదే తొలిసారి. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన స్పెయిన్‌కు 22వ నిమిషంలో పెనాల్టీ లభించింది. యువ ఆటగాడు లామిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీ ఇచ్చారు. ఆ అవకాశాన్ని మికెల్ ఒయర్‌జాబల్ సద్వినియోగం చేసుకుని తొలి గోల్ నమోదు చేశాడు. అనంతరం 58వ నిమిషంలో డానీ ఓల్మోతో చక్కటి పాస్‌ల మార్పిడి అనంతరం పెడ్రో పోరో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ ఆధిక్యాన్ని 2--0కు పెంచాడు. ఫ్రాన్స్ తరఫున కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలే, మైఖేల్ ఒలిసే వంటి స్టార్ ఆటగాళ్లు బరిలో ఉన్నప్పటికీ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయారు. స్పెయిన్ డిఫెన్స్ ముందు ఫ్రాన్స్ దాడులు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో వరుసగా మూడో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు గల్లంతయ్యాయి. 14 ఏళ్లుగా జట్టును నడిపిస్తున్న కోచ్ డిడియర్ డెషాంప్స్‌కు ఈ ఓటమి నిరాశ మిగిల్చింది. విజయం అనంతరం స్పెయిన్ ప్రధాన కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె జట్టు సమష్టి ప్రదర్శనను ప్రశంసించాడు. ఫ్రాన్స్ బలమైన దాడులను సమర్థంగా అడ్డుకోవడంలో ఆటగాళ్లు విజయవంతమయ్యారని పేర్కొన్నాడు. ఆదివారం న్యూజెర్సీలోని న్యూయార్క్-న్యూజెర్సీ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా-ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

# డబ్ల్యూటీసీకి సెమీ ఫైనల్స్

## ఐసీసీ కీలక ప్రతిపాదనలు




**ఎడిన్‌బర్గ్, జూలై 15 (చురకలు):** అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ, ఉత్కంఠ పెంచే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలి కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్స్‌ను ప్రవేశపెట్టడం, వన్డే ప్రపంచకప్‌లో జట్ల సంఖ్యను తగ్గించడం, కొత్త టోర్నీ విధానాలను అమలు చేయడం వంటి పలు ప్రతిపాదనలు ఐసీసీ వార్షిక సమావేశంలో చర్చకు వచ్చాయి. ప్రస్తుతం రెండేళ్ల చక్రంలో జరుగుతున్న వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో పాయింట్ల పట్టికలో తొలి రెండు జట్లు మాత్రమే ఫైనల్‌కు చేరుతున్నాయి. అయితే టోర్నీపై మరింత ఆసక్తి పెంచేందుకు ఇకపై తొలి నాలుగు జట్ల మధ్య సెమీఫైనల్స్ నిర్వహించి, విజేతలను ఫైనల్‌కు పంపే విధానాన్ని పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ మార్పు అమల్లోకి వస్తే డబ్ల్యూటీసీ మరింత ఉత్కంఠభరితంగా మారే అవకాశం ఉంది. అదే సమయంలో ఆఫ్ఘనిస్థాన్, ఐర్లాండ్, జింబాబ్వే జట్లను కూడా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో చేర్చేందుకు ఐసీసీ వర్కింగ్ గ్రూప్ కసరత్తు చేస్తోంది. టెస్ట్ క్రికెట్ విస్తరణకు ఇది కీలక అడుగుగా భావిస్తున్నారు. వన్డే ప్రపంచకప్‌లో కూడా మార్పులు ప్రతిపాదించారు. ప్రస్తుతం 14 జట్లతో నిర్వహిస్తున్న టోర్నీని 12 జట్లకు పరిమితం చేయడంతో పాటు 'సూపర్ సెవెన్' పేరుతో కొత్త దశను ప్రవేశపెట్టాలని ఐసీసీ పరిశీలిస్తోంది. 2027లో దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే సంయుక్తంగా నిర్వహించే ప్రపంచకప్ నుంచే ఈ మార్పులు అమల్లోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అలాగే టీ20 ప్రపంచకప్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న 'సూపర్ ఎయిట్' దశను 'సూపర్ టెన్'గా మార్చే అంశంపైనా చర్చలు జరుగుతున్నాయి. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌కు చెందిన మహిళా శరణార్థ క్రికెటర్లకు ఐసీసీ అండగా నిలిచింది. వారి కోసం రూపొందించిన అభివృద్ధి కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించిన మండలి, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను పునర్వ్యవస్థీకరించింది. 2030 నాటికి ఐసీసీ అర్హత టోర్నీల్లో ఈ మహిళా క్రికెటర్లు పాల్గొనేలా స్పష్టమైన కార్యాచరణ రూపొందించే బాధ్యతను ఆ బృందానికి అప్పగించింది. ఈ టాస్క్‌ఫోర్స్‌లో ఇప్పటికే భారత క్రికెట్ నియంత్రణ మండలి, క్రికెట్ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు ప్రతినిధులు ఉండగా, తాజాగా ఐసీసీ స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ రోస్ రివాజ్, ఐసీసీ ప్రధాన కార్యనిర్వాహకుల కమిటీ సభ్యురాలు సారా కీన్‌లను కూడా చేర్చింది. మహిళా శరణార్థ క్రికెటర్లకు సమాన అవకాశాలు, ప్రాతినిధ్యం, పోటీ వాతావరణం కల్పించడమే ఈ టాస్క్‌ఫోర్స్ ప్రధాన లక్ష్యమని ఐసీసీ వెల్లడించింది.




# హర్మన్ గైర్హాజరీలో కెప్టెన్సీకి సిద్ధం

## స్మృతి మంధాన

**లండన్, జూలై 15 (చురకలు):** భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ గైర్హాజరీలో జట్టును నడిపించేందుకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని స్టార్ ఓపెనర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన స్పష్టం చేసింది. ఎన్నో ఏళ్లుగా వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ నాయకత్వానికి అవసరమైన అనుభవాన్ని సంపాదించానని, అవకాశం వస్తే జట్టు పగ్గాలు చేపట్టేందుకు ఏమాత్రం వెనుకాడబోనని వెల్లడించింది. ఇంగ్లండ్‌పై లార్డ్స్ మైదానంలో జరిగిన ఏకైక టెస్టులో భారత్ చారిత్రక విజయం సాధించిన అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. హర్మన్‌ప్రీత్ స్థానంలో కెప్టెన్సీ చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అనే ప్రశ్నకు స్పందించిన స్మృతి, "అవును.. నేను పూర్తిగా సిద్ధంగా ఉన్నాను. హర్మన్ అందుబాటులో లేకపోతే జట్టుకు నాయకత్వం వహించేందుకు ఎలాంటి సందేహం లేదు" అని స్పష్టం చేసింది. జట్టులో బాధ్యతలు పంచుకోవడం ప్రతి ఆటగాడి కర్తవ్యమని, నాయకత్వ బాధ్యతలు వచ్చినప్పుడు వాటిని సమర్థంగా నిర్వర్తించేందుకు తాను సిద్ధంగా ఉంటానని పేర్కొంది. ఇటీవల లార్డ్స్‌లో జరిగిన తొలి మహిళల టెస్టు మ్యాచ్‌ను స్మృతి ప్రత్యేకంగా గుర్తు చేసుకుంది. ఆ చారిత్రక వేదికపై భారత్ తరఫున ఆడటం జీవితంలో మరిచిపోలేని అనుభూతిగా నిలిచిందని తెలిపింది. "ప్రతి క్రికెటర్‌కు టెస్టు క్రికెట్ ఆడాలనేది ఒక కల. అలాంటి మ్యాచ్‌ను లార్డ్స్ వంటి చారిత్రక మైదానంలో ఆడటం మరింత ప్రత్యేకం. అంతేకాదు, ఆ మ్యాచ్‌లో జట్టు విజయంలో నేను కూడా కీలక పాత్ర పోషించడం ఎంతో ఆనందంగా ఉంది" అని చెప్పింది. ఆ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అర్ధశతకాలు నమోదు చేసి భారత్ విజయంలో స్మృతి కీలక పాత్ర పోషించింది. నాయకత్వ పరంగా కూడా స్మృతి మంధానకు మంచి రికార్డు ఉంది. ఇప్పటివరకు ఆమె భారత మహిళల జట్టుకు 18 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు, నాలుగు వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించింది. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 15 విజయాలు అందించి తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించింది. ముఖ్యంగా ఆమె సారథ్యంలో భారత్ ఆడిన నాలుగు వన్డేల్లో ఒక్క మ్యాచ్‌లో కూడా ఓటమి చవిచూడకపోవడం విశేషం. ఈ గణాంకాలు భవిష్యత్తులో పూర్తి స్థాయి నాయకత్వ బాధ్యతలు చేపట్టే సామర్థ్యం తనకు ఉందనే విషయాన్ని మరోసారి చాటుతున్నాయి.

# జపాన్ ఓపెన్‌లో భారత షట్లర్లకు ఎదురుదెబ్బ

**టోక్యో, జూలై 15 (చురకలు):** జపాన్ ఓపెన్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ఆటగాళ్లకు నిరాశ ఎదురైంది. ప్రతిష్ఠాత్మక టోర్నీ తొలి రౌండ్‌లోనే స్టార్ షట్లర్లు లక్ష్య సేన్, ఆయుష్ శెట్టి ఓటమి పాలై నిష్క్రమించారు. వచ్చే నెలలో జరగనున్న ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు ముందు కీలక సన్నాహక పోటీగా భావించిన ఈ టోర్నీలో భారత జట్టుకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోడీ గాయాల కారణంగా పోటీ నుంచి తప్పుకోవడం భారత శిబిరాన్ని మరింత నిరాశకు గురిచేసింది. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ పద్నాలుగో ర్యాంకర్ లక్ష్య సేన్‌కు జపాన్‌కు చెందిన కోకి వతనాబే షాక్ ఇచ్చాడు. ఆరంభ గేమ్‌లో లక్ష్య పోటీ ఇచ్చినా కీలక సమయంలో వరుస తప్పిదాలు చేయడంతో 21-16 తేడాతో గేమ్‌ను కోల్పోయాడు. రెండో గేమ్‌లో వతనాబే దూకుడుగా ఆడి శక్తివంతమైన స్మాష్‌లతో లక్ష్యపై పూర్తి ఆధిపత్యం చెలాయించాడు. కేవలం 38 నిమిషాల్లోనే 21-14తో రెండో గేమ్‌ను కూడా గెలిచి వరుస గేమ్‌లలో విజయం సాధించాడు. దీంతో ఈ సీజన్‌లో నిలకడ కోసం ప్రయత్నిస్తున్న లక్ష్య మరోసారి నిరాశతోనే టోర్నీకి వీడ్కోలు పలికాడు. మరో యువ భారత షట్లర్ ఆయుష్ శెట్టి థాయ్‌లాండ్‌కు చెందిన రెండో సీడ్ కున్లావుట్ విటిడ్సార్న్‌కు గట్టి పోటీ ఇచ్చినా విజయాన్ని అందుకోలేకపోయాడు. తొలి గేమ్‌ను స్వల్ప తేడాతో కోల్పోయిన ఆయుష్, రెండో గేమ్‌లో ప్రత్యర్థి సాధించిన ఐదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని అద్భుతంగా గెలిచి పోరును నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. అయితే చివరి గేమ్‌లో అదే జోరును కొనసాగించలేక 21-19, 23-25, 21-15 తేడాతో పరాజయం పాలయ్యాడు. గంటా 22 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్ అభిమానులను ఉత్కంఠకు గురిచేసింది. మహిళల సింగిల్స్‌లోనూ భారత్‌కు ఆశించిన ఫలితం రాలేదు. ప్రపంచ ఇరవై నాలుగో ర్యాంకర్ ఉన్నతి హుడా చైనీస్ తైపీకి చెందిన హువాంగ్ యు-హ్సున్ చేతిలో మూడు గేమ్‌ల పోరులో ఓడిపోయింది. తొలి గేమ్‌ను గెలిచిన ఉన్నతి తర్వాతి రెండు గేమ్‌లలో ఆధిపత్యాన్ని నిలబెట్టుకోలేక 21-16, 16-21, 15-21 తేడాతో టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే భారత అభిమానులకు కొంత ఊరటనిచ్చేలా స్టార్ షట్లర్ పీవీ సింధు తొలి రౌండ్‌లో అద్భుత ప్రదర్శన చేసింది. మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించిన సింధు 21-14, 21-11 తేడాతో వరుస గేమ్‌లలో విజయం సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు జపాన్ ఓపెన్‌లో భారత ఆశలన్నీ సింధుపైనే నిలిచాయి.





# అర్జెంటీనాపై వివాదం

## తొలగించాలని లక్షలాది సంతకాలతో పిటిషన్

**న్యూయార్క్, జూలై 15 (చురకలు):** ఫిఫా ప్రపంచకప్-2026 సెమీఫైనల్‌కు ముందు డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వివాదంలో చిక్కుకుంది. జట్టుకు రిఫరీలు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్జెంటీనాను ప్రపంచకప్ నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూ 75 లక్షల మందికిపైగా సంతకాలతో ఒక ఆన్‌లైన్ పిటిషన్ దాఖలైనట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఈ అంశం ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పిటిషన్‌లో ఫిఫా, రిఫరీలు లియోనెల్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా జట్టుకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటున్నట్లు ఆరోపించారు. విజేతను ముందుగానే నిర్ణయిస్తే మిగతా జట్లు ఎందుకు పోటీపడాలని ప్రశ్నిస్తూ, అన్ని జట్లకు సమాన అవకాశాలు కల్పించాలంటే అర్జెంటీనాను టోర్నీ నుంచి తొలగించాలని అందులో కోరినట్లు ప్రచారం సాగుతోంది. అయితే ఈ ఆరోపణలపై ఫిఫా ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అలాగే పిటిషన్‌లో చేసిన ఆరోపణలకు స్వతంత్రంగా ఎలాంటి ఆధారాలు వెలుగులోకి రాలేదు. ఇదిలా ఉండగా సెమీఫైనల్‌లో అర్జెంటీనా, ఇంగ్లండ్ జట్లు తలపడనున్నాయి. ప్రపంచ ఫుట్‌బాల్‌లో ఈ రెండు జట్ల మధ్య పోటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. దక్షిణ అట్లాంటిక్‌లోని ఫాక్‌ల్యాండ్ దీవులు (అర్జెంటీనా భాషలో మాల్వినాస్) వివాదం కారణంగా ఇరు దేశాల మధ్య రాజకీయ విభేదాలు ఉన్న నేపథ్యంలో, ఆ ప్రభావం ఫుట్‌బాల్ మైదానంలోనూ తరచూ కనిపిస్తూ ఉంటుంది. ప్రత్యేకంగా 1986 ప్రపంచకప్ క్వార్టర్‌ఫైనల్‌లో డిగో మారడోనా సాధించిన వివాదాస్పద 'హ్యాండ్ ఆఫ్ గాడ్' గోల్ ఇప్పటికీ అర్జెంటీనా-ఇంగ్లండ్ పోరాటాల చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. ఇప్పుడు మరోసారి ప్రపంచకప్ సెమీఫైనల్‌లో ఈ రెండు జట్లు తలపడుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల దృష్టి ఈ మ్యాచ్‌పైనే నిలిచింది. అయితే అర్జెంటీనాపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఫిఫా లేదా టోర్నీ నిర్వాహకులు అధికారికంగా ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు.





# ప్రభాస్ అంటే.. మాంచి భోజనం గుర్తుకొస్తుంది

## హీరోయిన్ పూజా హెగ్డే ఆసక్తికర వ్యాఖ్య

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు. ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.



# వారణాసి కోసం..

## రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది



# వాటిపై సమంతకు మక్కువ

**హైదరాబాద్, జూలై 15 (చురకలు):** టాలీవుడ్ ప్రముఖ నటి సమంత వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకుంటున్న మార్పులు అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. ఒకప్పుడు వంట చేయడం పెద్దగా రాదని, ఎక్కువ సమయం చిత్రీకరణలకే కేటాయించేదానినని చెప్పిన సమంత.. ఇప్పుడు సంప్రదాయ వంటకాలపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతానికి చెందిన సంప్రదాయ వంటకాలను నేర్చుకుంటూ, వాటి తయారీలో సమయం కేటాయిస్తున్నట్లు సమాచారం. సన్నిహితుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం సమంత ఇంట్లోనే ఎక్కువ సమయం గడుపుతూ రాయలసీమకు ప్రత్యేకమైన ఘాటు రుచులు, సంప్రదాయ మసాలాలతో చేసే వంటకాల తయారీని నేర్చుకుంటున్నారట. స్వయంగా వంటలు చేసి వాటి రుచిని ఆస్వాదిస్తూ, కొత్త వంటకాలపై అవగాహన పెంచుకుంటున్నట్లు తెలుస్తోంది. ఒకప్పుడు వంటగదికి దూరంగా ఉండే ఆమె ఇప్పుడు కిచెన్‌లో సమయం గడపడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇటీవల ఆమె జీవితంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా కుటుంబంతో ఎక్కువ సమయం గడిపే అవకాశం లభించిందని, ఈ సమయంలో గతంలో నేర్చుకోలేని విషయాలపై దృష్టి సారిస్తున్నారని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం బయట కార్యక్రమాలను తగ్గించి విశ్రాంతి తీసుకుంటున్న సమంత, ఆరోగ్యకరమైన ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు సమాచారం. ఇంట్లో తయారయ్యే పోషకాహారంతో కూడిన సంప్రదాయ వంటకాలనే ఎక్కువగా నేర్చుకుంటున్నారని ఆమె సన్నిహితులు పేర్కొంటున్నారు. తెలుగు కుటుంబంలో కొత్త జీవితాన్ని ప్రారంభించిన తర్వాత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, స్థానిక వంటకాలపై సమంతకు మరింత ఆసక్తి పెరిగిందని కూడా ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా రాయలసీమ వంటకాల ప్రత్యేక రుచిని ఆమె ఎంతో ఇష్టపడుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యుల కోసం స్వయంగా వంట చేసి వడ్డించడం ద్వారా ఆమె కొత్త అనుభూతిని ఆస్వాదిస్తున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన 'మా ఇంటి బంగారం'చిత్రంలో కుటుంబానికి అండగా నిలిచే ఇంటి కోడలి పాత్రలో సమంత ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అదే తరహాలో నిజ జీవితంలోనూ కుటుంబంతో ఎక్కువ సమయం గడుపుతూ, సంప్రదాయ వంటకాలను నేర్చుకోవడం ద్వారా తన జీవితంలో మరో కొత్త కోణాన్ని ఆవిష్కరిస్తున్నారని అభిమానులు చర్చించుకుంటున్నారు

# 'టాక్సిక్' నుంచి మరో పాటకు సిద్ధం




**CHANGE OF NAME**

I, **SAVANAPELLY HARIKA D/O , SAVANAPELLY NARAYANA** H.No. 5-139/3, Chelgal Village Jagtial Rural Mandal and District Jagtial. I have changed my name as **HAMENA BEGUM** W/o **MA SAMI (NEW NAME)** for all purpose.

**CHANGE OF NAME**

**I, MALYALA RAJINI** D/O , **MALYALA BHUMAIAH** H.No. 5-139/3, Chelgal Village Jagtial Rural Mandal and District Jagtial. I have changed my name as **ABDUL SHAHEEDA BEGUM** W/o **MATIN** (NEW NAME) for all purpose.

**CHANGE OF NAME**

**I, YASMEEN** D/O , **M.A. MATEEN** H.No. 5-139/3, Chelgal Village Jagtial Rural Mandal and District Jagtial. I have changed my name as **HASEENA BEGUM** D/o **MOHAMMED ABDUL MATIN** (NEW NAME) for all purpose..


అద్వానీ మధ్య కనిపించిన నృత్యం, తెరపై వారి అభినయం ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అదే స్థాయిలో రాబోయే పాట కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, విశాల్ వెల్లడించిన తాజా సమాచారం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. భారీ యాక్షన్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యశ్ రెండు భిన్నమైన పాత్రల్లో కనిపించనున్నట్లు ప్రచారం సాగుతోంది. అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీతో పాటు పలువురు విదేశీ నటీనటులు కూడా ఈ చిత్రంలో భాగమయ్యారు. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లాతో కలిసి విశాల్ కూడా కొన్ని పాటలకు సంగీతం అందించారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, యశ్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ ఛాయాగ్రాహకుడు రాజీవ్ రవి చిత్రీకరణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 26న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com